J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12
THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 43 సంచిక : 3 23.6.2023, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

# 'షర్మి' ఇలా...

## నాన్న పరువు తీస్తున్న కూతురు




- తమ కుటుంబాన్ని బజారుకీడ్చిన పార్టీకి భుజమందిస్తున్న షర్మిల
- ఉమ్మడి రాష్ట్రాన్ని ముక్కలుచేసి ఆంధ్రులను వంచన చేసిన సోనియా పంచన చేరిన వై.ఎస్ బిడ్డ
- 30 ఏళ్ల పోరాట ఫలితంగా వచ్చిన చరిష్మా రాజశేఖరరెడ్డిది.. ఒక్క రాజకీయ పదవి కోసం దాన్ని తాకట్టు పెట్టాలా..?



రాజకీయాలలో విలువలకు స్థానం లేదని మరోసారి రుజువైపోయింది. పదవే పరమావధిగా ఎంతటి స్థాయికైనా దిగజారడానికి రాజకీయ నేతలు వెనుకంజ వేయరనడానికి వై.ఎస్.షర్మిల తాజా ఉదాహరణగా నిలిచింది. వై.ఎస్. ఆకస్మిక మరణం తరువాత అధికారదర్పంతో, దివంగత మహానేత రాజశేఖరరెడ్డి కుటుంబాన్ని చిత్రహింసలకు గురిచేసిన చరిత్ర కాంగ్రెస్‌పార్టీది, ఆ పార్టీ అధినేత్రి సోనియాగాంధీది. వై.ఎస్. కుమారుడు జగన్‌మోహన్‌రెడ్డిని ఆమె జైలు పాలు చేసింది. రాజన్న భార్య విజయమ్మని, కూతురు షర్మిలని, కోడలు భారతిని, మనుమడిని, మనుమరాళ్ళని హైదరాబాదు రోడ్లపై, ప్లాట్‌ఫారంపై పడుకునేలా చేసింది.

10లో



# 'లా సెట్‌లో' నెల్లూరీయుని ప్రతిభ

## రెండు తెలుగు రాష్ట్రాల పీజీ పరీక్షల్లో తూపిలి రవీంద్రబాబుకు ఫస్ట్ ర్యాంక్



**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన పీజీ లా ప్రవేశపరీక్షలోను, తెలంగాణా ప్రభుత్వం నిర్వహించిన పీజీ లా ప్రవేశపరీక్షలోను నెల్లూరుజిల్లా విడవలూరు గ్రామానికి చెందిన తూపిలి రవీంద్రబాబు 55 ఏళ్ళ వయస్సులో, పాతికేళ్ల వయసున్న యువతతో సైతం పోటీపడి, రెండు తెలుగు రాష్ట్రాల ప్రవేశపరీక్షల్లో మొదటి ర్యాంకు సాధించి అందరి అభినందనలు అందుకుంటున్నారు. భవన నిర్మాణాల ఇంజనీర్‌గా ప్రఖ్యాతి చెందినప్పటికీ, న్యాయవాదిగా కూడా ఉత్తమ సేవలు దిస్తున్న రవీంద్రబాబు మన నెల్లూరీయులు కావడం గర్వకారణం.**

రవీంద్రబాబు స్వస్థలం నెల్లూరుజిల్లాలోని విడవలూరు. 1968లో ఆయన జన్మించారు. తల్లితండ్రులు వెంకటసుబ్బయ్య-బుజ్జమ్మ. మండల కేంద్రమైన విడవలూరులోని ప్రభుత్వ పాఠశాలలో ప్రాథమిక విద్యాభ్యాసం చేసి, ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ కొడిగెనహళ్ళి గురుకుల పాఠశాలలో చదువుకున్న రవీంద్రబాబు 1987లో నెల్లూరు పాలిటెక్నిక్‌లో సివిల్ ఇంజనీరింగ్‌లో డిప్లొమా సాధించారు. తదుపరి, ఏ సబ్జెక్టుకు ఎటువంటి కోచింగ్ తీసుకోకుండా, ఎంతో క్లిష్టమైన ఇన్స్టిట్యూషన్ అఫ్ ఇంజనీర్స్, కలకత్తా వారి ఏ.ఎం.ఐ.ఇ పరీక్షల్లో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. అనంతరం, కేంద్ర ప్రభుత్వం 1990లో నిర్వహించిన ఉద్యోగ నియామక పరీక్షల్లో సైతం దక్షిణ భారతదేశం మొత్తానికి ప్రథమ ర్యాంకు సాధించి కేంద్ర పట్టణాభివృద్ధి శాఖలో జూనియర్ ఇంజనీర్‌గా ఉద్యోగం సంపాదించాడు. ఎం.టెక్ (స్ట్రక్చరల్ ఇంజనీరింగ్) చదివి, భూకంపాలను తట్టుకునే నిర్మాణాలను డిజైన్ చెయ్యడంలో అనేక ప్రత్యేక శిక్షణలు పొంది, 15 అంతస్తుల వరకు అనేక అత్యంత ఎత్తైన ప్రభుత్వ భవనాలకు స్ట్రక్చరల్ డిజైనింగ్ చేసి, కార్యనిర్వాహక ఇంజనీర్ వరకూ వివిధ పదోన్నతులు పొందారు. ఆ తర్వాత న్యాయవిద్యపై మక్కువతో, 2020 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన లా సెట్-2020 ప్రవేశపరీక్షల్లో, ప్రథమ ర్యాంక్ సాధించి, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగానికి సైతం రాజీనామా చేసి, విజయవాడ సిద్దార్థ న్యాయ కళాశాలలో ఎల్ఎల్‌బి కోర్స్ చేరారు. మళ్ళీ అదే స్ఫూర్తితో రవీంద్రబాబు రెండు తెలుగు రాష్ట్రాల 2023 పీజీ లాసెట్ పరీక్షల్లో ప్రథమ ర్యాంకు సాధించి అందరికీ మార్గదర్శకమయ్యారు. రవీంద్రబాబు ఇంజనీరు, న్యాయవాది మాత్రమే కాక కవి, రచయిత కూడా. నెల్లూరులో పెన్నా రచయితల సంఘం వారు ఇటీవల నిర్వహించిన కవిసమ్మేళనంలో పాల్గొని ప్రథమ బహుమతిని అందుకున్నాడు.

### ఇంజనీర్‌గా నిరుపమానమైన సేవలు :

ఇన్‌కంటాక్స్ డిపార్టుమెంటు ప్రాపర్టీ వాల్యుయేషన్ సెల్‌లో, ఇంజనీర్‌గా సుమారు 5 సంవత్సరాల పాటు డెప్యూటేషన్‌పై ఉద్యోగం సంపాదించి నిరుపమానమైన సేవలందించిన రవీంద్రబాబు, దక్షిణ భారతదేశంలోని (అండమాన్, లక్షదీవులతో సహా) జవహర్ నవోదయ విద్యాలయాలకన్నింటికి 5సంవత్సరాల పాటు డెప్యూటేషన్‌పై ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా సేవలందించారు. నికోబార్ దీవుల్లో సుమారు రెండు సంవత్సరాల పాటు, సునామీ రిలీఫ్ పనుల్లో కీలక బాధ్యతలు చేపట్టారు. హైదరాబాద్ మసాబ్ ట్యాంక్‌లోని ఇన్‌కంటాక్స్ డిపార్ట్‌మెంట్ బిల్డింగ్, ఐటీ టవర్స్‌కి స్ట్రక్చరల్ డిజైనర్‌గా, హైదరాబాద్ శివరాంపల్లిలోని నేషనల్ పోలీస్ అకాడమీకి చెందిన 15 అంతస్తుల స్టాఫ్ క్వార్టర్స్‌కి ప్రధాన స్ట్రక్చరల్ డిజైనర్‌గా ఆయన పని చేశారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ఆర్‌టిఐ జాయింట్ యాక్షన్ కమిటీలో నెల్లూరు జిల్లా ప్రతినిధిగా విధులు నిర్వహిస్తున్నారు. 2022లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో సీనియర్ జడ్జి వద్ద ఇంటర్న్‌షిప్ చేశారు.

### న్యాయవాదులకు ఉచితంగా ఆన్‌లైన్ కోచింగ్ :

ప్రస్తుతం వర్ధమాన న్యాయవాదులకు ఏ.ఐ.బి.ఇ పరీక్షకు ఉచితంగా ఆన్‌లైన్ కోచింగ్, క్లాట్ మరియు లాసెట్‌కు విద్యార్థులకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ ఇచ్చేందుకు సమాయత్తమవుతున్నారు. ప్రత్యేకించి నెల్లూరులో ఉచిత న్యాయసలహా కేంద్రం ఏర్పాటుకు కృషిచేస్తున్నారు. నిజాయితీగా పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులకు వేధింపుల నుండి రక్షణ పొందడానికి ఉచిత న్యాయ సహాయం అందిస్తానని ఆయన చెప్తున్నారు. ఏదేమైనా, న్యాయవిద్యలో అనితరసాధ్యమైన ప్రతిభను చూపుతున్న రవీంద్రబాబు మన నెల్లూరీయులు కావడం విశేషం.

# విద్యుత్‌చార్జీలు తగ్గించాలంటూ సిపిఎం ఆందోళన

ఈనెల 16న కోవూరులోని బజార్‌సెంటర్‌లో సిపిఎం ఆధ్వర్యంలో పెరిగిన విద్యుత్ ఛార్జీలపై పెద్దఎత్తున ఆందోళన జరిగింది. సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు గండవరపు శేషయ్య మాట్లాడుతూ, వైకాపా ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి విద్యుత్ ఛార్జీలు నానాటికీ పెరుగుతున్నాయే తప్ప తరగడం లేదన్నారు. ఈ ఆందోళనలో సిపిఎం నాయకులు ఎస్‌కె బాబు, సురేంద్ర, సురేష్, శివ, చాంద్‌బాషా, ఖాదర్‌బాషా, బుజ్జయ్య, కాలేషా, గోవర్ధన్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



## సమస్యలు తీర్చాలంటూ..
# జర్నలిస్టుల వినతి

జిల్లాలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపియుడబ్ల్యుజె ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.రమేష్ బాబు, టి.ఖాజారహంతుల్లా, కోశాధికారి ప్రదీప్ తదితరులు ఇటీవల జిల్లా కలెక్టర్ హరినారాయణన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో 50 శాతం ఫీజు రాయితీ ఇప్పించాలని, నెల్లూరునగరం, రూరల్ పరిధుల్లో ఉన్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

# గంజాయి ముఠా అరెస్టు



## నలుగుర్ని అదుపులోకి తీసుకున్న 'సెబ్'

గంజాయి అక్రమరవాణాకు పాల్పడు తున్న నలుగురు నిందితులను ఇటీవల సెబ్ (స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో) అధికారులు అదుపులోకి తీసుకున్నారు. సెబ్ నెల్లూరు-1 స్టేషన్‌లో ఇన్‌చార్జి ఇన్స్‌పెక్టర్ వి.వెంకటేశ్వరరావు ఇటీవల ఆ వివరా లను వెల్లడించారు. నెల్లూరులోని కపాడి పాళెంలో గంజాయి క్రయవిక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారంతో సెబ్ అధికారులు దాడులు చేసి అందుకు సంబంధించిన జహరాబీ, స్రవంతిప్రియ, సువర్ణప్రకాష్, హరిబాబురెడ్డిలను పట్టు కుని, వారివద్ద నుంచి 2కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. సెబ్ నెల్లూరు-1 ఎస్ఐ ఏ.శ్రీనివాసరావు, కాని స్టేబుళ్ళు టి.వెంకటేశ్వర్లు, కె.ప్రకాష్‌రావు తదితరులు ఈ దాడుల్లో పాల్గొన్నారని, నిందితులపై కేసులు నమోదుచేసి కోర్టుకు హాజరుపరిచామని తెలిపారు.

## వేముల రజనికి
# వివిఎస్‌యు నుంచి డాక్టరేట్



నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో పరిశోధన చేసిన వేముల రజనికి యూనివర్సిటీ వారు ఇటీవల డాక్టరేట్ ప్రదానం చేశారు. బయోటెక్నాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫె సర్ డాక్టర్ సి.కిరణ్మయి పర్యవేక్షణలో "ఇన్సిట్రో కన్సర్వేషన్ అండ్ ఫార్మకో లాజికల్ స్క్రీనింగ్ ఆఫ్ కారలుమా ప్రొకం బెన్స్, ఎన్ ఎండేంజర్డ్ అండ్ ఎండమిక్ ప్లాంట్ స్పీసీస్ ఆఫ్ సదరన్ ఇండియా" అనే అంశంపై ఆమె పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని యూనివర్సిటీకి సమ ర్పించారు. వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన ముగ్గురు అధ్యాపకుల సిఫార్సుతో ఆమెకు డాక్టరేట్ ఆఫ్ ఫిలాసఫీని ప్రదానం చేశారు.

# వైభవంగా మానసాదేవి బ్రహ్మోత్సవాలు



వరికుంటపాడు మండలం తూర్పురొంపిదొడ్ల గ్రామంలో కొలువై ఉన్న శ్రీ మానసాదేవి అమ్మవారి బ్రహ్మోత్సవాలు ఇటీవల అత్యంతవైభవంగా ప్రారంభమ య్యాయి. భక్తుల కొంగుబంగారంగా, కోరిన కోర్కెలు తీర్చే చల్లనితల్లిగా అమ్మవారు ప్రసిద్ధి. అమ్మవారి అనుగ్రహం ఉంటే చాలు, పిల్లలు లేనివారికి సంతానం కలుగుతుందని ప్రఖ్యాతి. ప్రతిఏటా వెంగమాంబాదేవి బ్రహ్మోత్సవాలు పూర్తయిన మరుసటిరోజు నుంచి మానసాదేవి అమ్మవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమై, మూడురోజుల పాటు అంగరంగవైభవంగా జరిగాయి. చల్లా వంశస్థుల ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఉత్సవాల్లో గ్రామస్తులు, ఇతర ప్రాంతాల భక్తులు సైతం పెద్దసంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకొన్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ఆలయ అర్చకులు తొలుత అమ్మవారిని శోభాయమానంగా అలంకరించి ప్రత్యేకపూజలు చేశారు. గణపతి పూజ, పుణ్యాహవచనం, నవగ్రహ మండపారాధన, మూలమూర్తులకు పంచామృతాభి షేకాలు నిర్వహించి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. మూడు రోజుల పాటు ఈ వేడుకలతో గ్రామంలో పండుగ వాతావరణం కనిపించింది. ఆలయ అర్చకులు అమ్మవారికి విశిష్టపూజలు, సేవలు చేసి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించారు.

# నర్రవాడ వెంగమాంబాదేవికి 49.38 లక్షల రాబడి

## గత ఏడాదికంటే పెరిగిన ఆదాయం



జిల్లాలోని ప్రసిద్ధమైన దుత్తలూరు మండలం నర్రవాడలో కొలువై ఉన్న శ్రీ వెంగమాంబాదేవి పేరంటాలు అమ్మ వారి బ్రహ్మోత్సవాలు ఇటీవల ఎంతో వైభవంగా జరిగాయి. మూడురోజుల పాటు జరిగిన ఈ ఉత్సవాల్లో భక్తులు వేలసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా అమ్మవారికి భక్తులు భారీ కానుకలు సమర్పించుకున్నారు. గత ఏడాది కంటే ఈసారి బ్రహ్మోత్సవాల ఆదాయం కొంత పెరిగిందని కూడా చెప్తున్నారు. తాజాగా హుండీ లెక్కింపు ద్వారా దేవస్థానానికి 49,38,118 రూపాయల రాబడి వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఉషశ్రీ తెలియజేశారు. ఇటీవల ఆలయంలోని హుండీలను లెక్కించగా భక్తులు హుండీల్లో వేసిన కానుకల ద్వారా 26,07,420 రూపాయలు వచ్చాయని పేర్కొన్నారు. అదేవిధంగా తాత్కాలిక దుకాణాల ఏర్పాటు ద్వారా మరో 7.95,000 రూపాయలు, అమ్మవారి లడ్డూ ప్రసాదాల విక్రయాలతో 7,48,395 రూపాయలు వచ్చాయని, దర్శనం టిక్కెట్ల ద్వారా 7,70,707 రూపాయలు, తలనీలాల టిక్కెట్ల విక్రయం ద్వారా 37,765 రూపాయలు, అమ్మవారి కల్యాణ చదివింపులు 24,308 రూపాయలు వచ్చాయని, ఇతరత్రా ఆదాయంతో కలిపి మొత్తం 49.38 లక్షలు వచ్చిందని పేర్కొన్నారు. హుండీ లెక్కింపును ఆలయ ధర్మకర్తలు పచ్చవ కరుణాకర్, పచ్చవ వెంకటేశ్వర్లు, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారని తెలిపారు.

# వాకాటిని అభినందించిన కలెక్టర్



నెల్లూరు నగరంలోని పొదలకూరు రోడ్డులో గల విభిన్న ప్రతిభావంతుల బాలిక వసతి గృహానికి స్వచ్ఛందంగా త్రాగునీటి ఆర్.ఓ సిస్టంను విరాళంగా అందజేసిన వోడరన్ స్కూల్ కరస్పాండెంటు వాకాటి విజయకుమార్‌రెడ్డిని జిల్లా కలెక్టర్ యం.హరినారాయణన్, అభినందించారు. తన తల్లిదండ్రులు వాకాటి పెంచలరెడ్డి-రాఘమ్మల జ్ఞాపకార్థం వాకాటి విజయకుమార్‌రెడ్డి 70వేల రూపాయలు విలువచేసే ఆర్.ఓ సిస్టంను, స్టీల్ వాటర్ బాటిల్స్, స్టీల్‌ప్లేట్స్, స్టీల్ గ్లాసులను విరాళంగా అందజేశారు. జిల్లా కలెక్టర్ హరినారా యణన్ ఇటీవల ఆ ఆర్.ఓ సిస్టంను ప్రారంభించి విజయకుమార్‌రెడ్డిని అభినందించారు. విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు అక్బర్ ఆలీ, రెవెన్యూ శాఖ విశ్రాంత సీనియర్ ఉన్నతాధికారి పెంచలరెడ్డి, వార్డెన్ కస్తూరి పాల్గొన్నారు.

# కలెక్టరేట్ వద్ద గిరిజనుల ఆందోళన

ఏపీ జెన్‌కో నుంచి వచ్చే బూడిద కాలుష్యం వల్ల ముత్తుకూరు మండలం పైనాపురం పంచాయతీకి చెందిన దేవరదిబ్బ గిరిజనులు రోగాల పాలవుతున్నారని, ఆ కాలుష్యం నుంచి గిరిజనులను కాపాడాలని కోరుతూ ఈనెల 19న నెల్లూరులోని కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆ గ్రామ గిరిజనులు జిల్లా యానాదుల సంక్షేమసంఘం ఆధ్వర్యంలో ధర్నా దోళన చేపట్టారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసీ పెంచలయ్య మాట్లాడుతూ, బూడిద కాలుష్యం మూలంగా గ్రామంలో ఇప్పటికే పలువురు మృతిచెందారని, అనేకమంది అనారోగ్యం పాలవుతున్నారని కలెక్టర్‌కు వివరించారు. వెంటనే దేవరదిబ్బ గిరిజనులకు ప్రత్యామ్నాయం చూపాలని కోరారు. అనంతరం 'స్పందన' కార్యక్రమంలో ఉన్న కలెక్టర్‌కు ఆమేరకు విజ్ఞాపన పత్రం సమర్పించారు. ఆ సంఘం జిల్లా ఛైర్మెన్ రాపూరు కృష్ణయ్య, మహిళావిభాగం అధ్యక్షురాలు సిహెచ్ ఉష తదితరులు పాల్గొన్నారు.

# మీ ఆశీస్సులతో ఒకేరోజు
# మూడు షోరూంలు బ్రహ్మాండమైన ప్రారంభం!

50th SHOWROOM
నెల్లూరు
24-06-2023
సాయంత్రం 5.00 గం.లకు
1490, మినీ బైపాస్ రోడ్,
మాగుంట లేఅవుట్.
ఫోన్: 9966100556




Lalithaa®
లలితా జ్యువెల్లరి
మార్ట్ ప్రై. లిమిటెడ్

## నెల్లూరు.. నాకు అది ఓ పేరు మాత్రమే కాదు..

ఓ ప్రాంతం మాత్రమే కాదు.. నా జీవితంలోని 'ఎదుగుదల' అన్న మాటకు అక్షరాలు అద్దుకున్న ప్రతిరూపం!

అడుగడుగునా నన్ను ఉన్నత స్థాయికి చేర్చిన.. అలుపు లేకుండా శ్రమించే తత్వాన్ని నేర్పిన గడ్డ.. నా జీవితంలో ఎంతో మహత్తరమైన అనుబంధమున్న మాతృభూమి ఇది. 12 ఏళ్ల వయసులో ఓ నగల ఫ్యాక్టరీలో కూలీగా పనిచేసిన ఇదే నెల్లూరులో.. నేను కలలుకన్న 50వ షోరూంను ప్రారంభించడం ఆనందంగా ఉంది.

ఈ షోరూం నెల్లూరు ప్రజలది.. నెల్లూరులో ఉన్న ప్రతి ఒక్కరిది..

**ఈ షోరూంను నా కుమార్తెలు భక్తి కిరణ్, భవ్య కిరణ్‌లచే ప్రారంభించుకుంటున్నా..**

నెల్లూరుతో పాటు సూళ్లూరుపేట, గూడూరులో కూడా ఒకేరోజు మూడు షోరూంలు ప్రారంభించడం చాలా సంతోషం.

ఇంకో విషయం, బంగారం ఓ అలంకార వస్తువు మాత్రమే కాదండి. అది అవసరానికి ఆదుకునే ఆపద్బాంధవ పెట్టుబడి! సరైన అవగాహనతో ప్రజలు నగలు కొనాలన్నదే నా ఆశయం. దయచేసి నాలుగైదు షోరూంలలో ధరలు చెక్ చేసి కొనండి. ఏమాత్రం తప్పులేదు. ఎందుకంటే అది మీ డబ్బు!

మీ కుటుంబంలో ఒకడినైన నేను మీ ఆశీస్సులతో ఈ స్థాయికి వచ్చా.. మీ ఆశీస్సులు ఎప్పటికీ ఇలాగే ఉండాలని కోరుకుంటూ.. శిరస్సు వంచి నమస్కరిస్తూ.. స్వాగతం పలుకుతున్నా..!

- డాక్టర్ ఎం.కిరణ్‌కుమార్




48th SHOWROOM
ఉదయం 8.00 గం.లకు
**సూళ్లూరుపేట**
12-153,
జీఎన్‌టీ రోడ్.
ఫోన్: 9966100553

24-06-2023

స్వాగతం..
సుస్వాగతం!

49th SHOWROOM
ఉదయం 10.35 గం.లకు
**గూడూరు**
1 & 3, హాస్పిటల్ రోడ్,
రెవిన్యూ వార్డు నెం.12
ఫోన్: 9966100551




## బంగారు నగలు కొనే విధానంలో మార్పు రావాలి!

మీరు కష్టపడి సంపాదించిన డబ్బుతో నగలు కొంటున్నారు. అందువల్ల తగిన సమయం కేటాయించి కొనండి.
లలితా జ్యువెల్లరిలో ఎస్టిమేట్ స్లిప్ మరియు మొబైల్ ఫొటో తీసుకుని నాలుగైదు షోరూంలలో పోల్చి చూడండి.
ఎక్కడ తక్కువ ధరకు లభిస్తుందో అక్కడ కొనండి. అధిక తరుగుకు, అధిక ధరలకు స్వస్తి పలకండి.

చెయిన్, గాజులు, నెక్లస్, చోకర్స్, హారం, వంకీ, ఒడ్డాణం, ఉంగరాలు, కమ్మలు, జుమ్కీలుతో పాటు పలురకాల నగలు లక్షలాది సంఖ్యలో మా కొత్త షోరూంలలో ఉన్నాయి.

లాయర్
జూన్ 23, 2023

# ఆహార వృధాను అరికట్టలేమా?

'అన్నం పరబ్రహ్మ స్వరూపం' అన్నారు పెద్దలు. ఆహారం లేనిదే ప్రాణం నిలవదు. జీవితం అసలే గడవదు. ఎంత గొప్ప స్థాయిలో ఉన్నా ఆహారం తినక తప్పదు. మనుషులకే కాదు జీవులన్నిటికీ ఇది తప్పనిసరి. జానెడు పొట్ట నింపుకోవడానికి కార్మికులు, కర్షకులు నిరంతరం ఎంత శ్రమపడుతుంటారో అందరికీ తెలిసిందే. అర్ధాకలితో, పస్తులతో బతికేవారు కోట్లల్లోనే ఉన్నారు. 'కోటి విద్యలు కూటి కొరకే' అన్నట్లుగా ఎవరెంత కష్టపడి పనిచేసినా ముందు ఆకలి తీర్చుకోవడమే ముఖ్యం. ఎంతపెద్ద కోటీశ్వరుడైనా 'లవణమన్నమె గాని మెరుగు బంగారంబు మింగబోడు' అని పెద్దలెప్పుడో చెప్పారు. ఆకలికి పేద ధనిక తేడాలుండవు. ఎవ్వరైనాసరే తిని తీరాల్సిందే. డబ్బు-బంగారం ఎంతున్నా అన్నం మెతుకులు లేకుంటే బతకలేం. అంత ప్రాధాన్యత ఉన్న ఆహారానికి కూడా రాను రాను విలువుండడం లేదు. ఇష్టం వచ్చినట్లు వృధా చేస్తుండడం మామూలైపోయింది. ఒక్క మనదేశంలోనే కాదు, ప్రపంచ వ్యాప్తంగా ఆహారాన్ని వృధా చేస్తూనే ఉండడం దారుణం. నిపుణుల అంచనాల ప్రకారం ప్రపంచంలో తయారయ్యే ఆహారంలో మూడోవంతు, అంటే సుమారు 1300 కోట్ల టన్నుల ఆహారం వృధా అవుతోందంటే ఎంత బాధాకరం. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 82 కోట్లమంది ప్రజలు సరైన ఆహారం దొరక్క నిత్యం బాధలు పడుతూనే ఉన్న నేపథ్యంలో ఆహారాన్ని వృధా చేస్తుండడం మరీ విచారకరం. అందులోనూ కరోనా తర్వాత కోట్లాది మంది ప్రజలు మంచి ఆహారానికి దూరమయ్యారు. పనులు లేక, నిరుద్యోగంతో అర్ధాకలితో బాధలు పడినవారు కోట్లల్లోనే ఉన్నారు. ఒకవైపు పేదరికం, రెండో వైపు నిరుద్యోగం రెండూ సామాన్య ప్రజలను నేటికీ పీల్చి పిప్పి చేస్తూనే ఉన్నాయి. సరైన పోషకాహారం దొరక్క బీదప్రజలు, కోట్లాదిమంది పిల్లలు బక్కచిక్కిపోతున్నారు. మరోవైపు ధరలు అమాంతం ఆకాశానికి పెరిగిపోతుండడంతో సగటు మానవునికి సరైన పోషకాహారం అన్నది కూడా గగన కుసుమమైపోతోంది. ప్రపంచవ్యాప్తంగా ఇప్పుడున్న పెద్ద సమస్యల్లో ఆహారం వృధా చేయడం కూడా ఒకటిగా మారింది. ఇళ్ళలోంచి, హోటళ్ళు, రెస్టారెంట్లు వగైరాల్లోంచి దాదాపు ప్రతిరోజూ పారవేయబడే ఆహారం లక్షల టన్నుల్లోనే ఉంటోంది. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో ఆహారం నిత్యం కోట్ల టన్నుల్లో వృధా అవుతూనే ఉంది. పారేసేవాళ్ళు పారేస్తుంటే, పస్తుండేవాళ్లు కన్నీళ్లతోనే బతుకుతున్నారు. ఇకనైనా ఈ తీరు మారాలి. మనదేశంలోనూ ఆహార వృధా భారీస్థాయిలోనే ఉండడం మరింత బాధపడాల్సిన అంశం. దేశంలో కోట్లాది మందికి ఆహారం లేకున్నా, మరోవైపు ఆహారం వృధాగా పారవేస్తుండడం మరీ ఘోరం. ప్రపంచ ఆకలిసూచీలో 121 దేశాలుంటే, అందులో మనస్థానం 107వది. అయినా మన దేశంలోనూ ఆహార వృధా భారీగానే ఉంది. ఆహారపదార్ధాలు వృధా కావడమంటే, వాటి వెనుక ధనంతో పాటు శ్రమ, ఇంధనం, రవాణా ఇలా ఎన్నో వృధా అయినట్లే. అంతేకాదు, పారవేయబడిన వ్యర్థ ఆహారపదార్థాల వల్ల కాలుష్యం పెరిగి అటు ఆరోగ్యానికి, ఇటు పర్యావరణానికి కూడా ముప్పు ఏర్పడుతుంది. ఎంతో కష్టపడి శ్రమిస్తే గానీ ఆహారం ఉత్పత్తి కాదు. ఎందరి కష్టం నుంచో అన్నం (ఆహారం) అందరికీ అందుబాటులోకి వస్తుంది. ఆహారాన్ని అవసరమైన మేరకే వాడుకోవాలే తప్ప, మితిమీరి తయారు చేసుకోవడం, పారేయడం మంచిది కాదు. కొన్నిచోట్ల శుభకార్యాలు, వేడుకల పేరుతో తయారుచేసిన ఆహారపదార్ధాలు మిగిలిపోవడంతో వృధాగా పారవేయడం చూస్తూనే ఉంటాం. ఆహారం తయారీకి ఉపయోగపడే పండ్లు, సరుకులు వగైరాలన్నిటినీ సరైన పద్ధతిలో నిల్వ చేసుకోవడం, ఎంత అవసరమో అంత ఉపయోగించుకోవడం, ఎంత తినగలమో అంత వండుకోవడం వంటి చిన్నచిన్న మార్పులతోనే ఆహార వృధాను ఎవరికి వారు అరికట్టవచ్చు. వాస్తవానికి మనం వృధా చేసే ఆహారం ద్వారా ఎంతోమంది ఆకలి తీర్చవచ్చు. ఏదేమైనా, ఆకలైతే తప్ప అన్నం విలువ తెలియదని అంటుంటారు. ఆకలైనవారికే దాని విలువ తెలుస్తుంది. ప్రపంచంలో ప్రతిఒక్కరూ ఏదో ఒక సందర్భంలో ఆకలిని ఎదుర్కొంటూనే ఉంటారు. కానీ, తమ ఆకలి తీరాక ఇతరుల ఆకలి బాధను పట్టించుకోరు. అదే దురదృష్టకరం. తమకున్న దాంట్లో ఇతరుల ఆకలి తీర్చాలనుకోవడం కంటే మానవీయమైన గొప్ప విషయం ఇంకేముంటుంది?.. ఇకనైనా ఆహారం వృధా కాకుండా చూసుకోవాలి. ఒకరికి అన్నం పెట్టిన పుణ్యం ఎక్కడికీ పోదు అనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఎవరికి వారు చిత్తశుద్ధితో శ్రద్ధ తీసుకుంటే.. ఆహార వృధాను అరికట్టడం పెద్ద కష్టమేమీ కాదు.

# సెప్పులు సూపిత్తుండారబ్బయ్యో!



పొద్దుగూకులూ బజార్లో ఏం పనిరా అబ్బయ్యా ..? ఇంటికాడకెల్లి టీవీ సూడ్రాదా, మన నాయకులు మాంచి కొత్త మోడల్ల సెప్పులు సూపిస్తుండారు. పవను కల్యాను ఒక సెప్పు సూపిస్తే పేరినినాని రెండు సెప్పులూ సూపిత్తుండాడురా నాయనా. నాని సెప్పులు సూపీయడమే కాదు పవను కల్యానుని మక్కెలు ఇరగదంతానని కూడా వార్నింగు ఇచ్చాడు. మా సిన్నతనంలో రాజకీయ నాయకుల మీటింగులలోనో, టేజి మీద నాటకాలలోనో యవ్వారం బాగాలేకపోతే పాత సెప్పులు టమాటాలు ఇసిరేవోల్లు. నువ్వొక సెత్త గాడివి అని పొలిటికలోళ్ల మీదా, నీ యాకిటింగు బాగలేదని టేజి యాక్టర్‌ల మీదా సెప్పులు ఇసిరి నూకే వోల్లు. ఇయ్యాల పేపరోళ్ల ముందు, పబిలికు మీటింగులలో సెప్పులు తీసి సూపిస్తుండారు. పెస్తుత రాజకీయాలన్నీ సెప్పుల సుట్టూ తిరగతా ఉండాయి.

పెపంచకంలో సాలా చోట్ల ఇలా సెప్పులు ఏసే సాంప్రదాయం వుంది. తమ లీడరు వాళ్లకి నచ్చకపోయినా, అయన పెబుత్వం నడిపే ఇదానం బాగాలేక పోయినా జనాల్లోకి వచ్చినప్పుడు సెప్పులేత్తారు. ఇది బిటీషోళ్ళ కాలం నుండి వస్తున్న అలవాటని




మా పెద్దోళ్ళు సెప్పే వాళ్ళు. మన కాడే కాదు సాలాసోట్ల ఇలా జరిగింది కూడా. కానీ అది నాయకులమీదా, నటుల మీదా పెజలు ఏసేవోల్లు. కానీ ఇప్పుడు కతే మారిపోయిందిలే...! నాయకులే పెజలకి సెప్పులు సూపిస్తుండారబ్బయ్య. వాళ్ళకే ఒకరికొకరు సెప్పులు సూపించుకునే పనిలో మద్దెలో పెజల్ని పేచ్చకులని సాస్తావుండారు.

అసలే దానబ్బడాల ఎండలు మిడిమేలంగా మండి సత్తా ఉండాయా.. ఎండల్లో సెప్పులు లేకుండా వొక్క అడుగైనా ఎయ్యలేకపోతుండామా!.. ఈ కాల్లు సూడు.. ఏడబట్నా అంతా బొబ్బలే. మన్లాంటి పేదోల్లు దేసమంతా ఉండ్లా. ఇంకా అడువులు పక్కల, కొండలకాడ గుట్టల కాడ, చిన్నచిన్న వూళ్లల్లో ఉండేవోళ్ళు, బీదాబిక్కీ జనాలు ఇంకెంతమంది ఉండారో.. వాల్ల కాల్లకేమైనా సెప్పులుండాయా?..వొందలు వేలు డొబ్బులు తగలేసి కొత్తకొత్త సెప్పులు కొనుక్కుని సోగ్గా దిరిగే దొరబాబులుకి ..అసలు సెప్పులే లేకుండా ఎండల్లోబడి తిరిగే మన్లాటి పేదోల్ల కస్టం ఏం దెలత్తది? ఒకల్లమీ దొకల్లు సెప్పిరగ్గొడతా..కాల్లిరగ్గొడతా అంటా సెప్పులు సూపిత్తావుండేవోల్లంతా..ఆ సెప్పులేవో మన మొకాన కొడితే పోలా..మన కాల్లకన్నా ఏసుకుంటాం గదా!..వూల్లల్లో గొప్పగొప్ప పేరుండే నాయకులంతా కాల్లకేసుకోవాల్సిన సెప్పుల్ని అన్నంతినే సేతుల్లో పట్టుకుని ఒకేమాయిన పొగులు పొద్దుగూకులూ తిట్టుకోకపోతే.. పుట్టినకాణ్ణించీ సెప్పులు లేకుండా కాల్లు బొబ్బలెక్కి పుళ్లుపడిపోతావుండే సిన్నసిన్న పిలగోళ్ళకైనా సెప్పులు కొనిత్తే అదెంతో పున్నెం గదా!... ఆ మాత్తరం ఇంగితం లేకపోతే ఎట్టా?...

ఏందోలేరా అబ్బయ్యా!..వోల్ల సెప్పులు వోల్లయ్యి.. మన తిప్పలు మనయ్యి. అయినా... ఎంత గెట్టిగా బుర్రపెట్టి ఆలోసిత్తావున్నా.. ఈ సెప్పుల మందలైతే నాకేం అర్ధమై సావడం లేదురా!.. వాల్లకి వాల్లు సూపిచ్చుకుంటున్నారా..లేకపోతే మనలాంటోల్లకి.. ఓట్లేసి గెలిపిత్తే మీ సెప్పుతో మీరే కొట్టుకోవాల్సివత్తాదని నైసుగా సెప్తావుండారా?..నాయకులేం జేసినా దాన్లో ఏదేదో టక్కుటమారాలు వుండనే వుంటాయని మా యబ్బ బతికున్నప్పుడు సెప్తావుండేవోడు. ఇద్ది గూడా అట్టాటిదే అయ్యుంటద్దేమోరా అబ్బయ్యా!.. ఇదీ మందల!...

- సదువుకోని సుబ్బయ్య

# ఉదయగిరి అభివృద్ధి.. అంతా ఉత్తుత్తిదేనా?

జిల్లాలోని చరిత్రాత్మకమైన ప్రాంతమైన ఉదయగిరిని బ్రహ్మాండంగా అభివృద్ధి చేస్తామని, పర్యాటక ప్రాంతంగా రాష్ట్ర వ్యాప్తంగా గొప్ప పేరు వచ్చేలా తీర్చిదిద్దుతామని నాయకులు ఎంతోకాలంగా చెప్తున్న మాటలు నేటికీ ఆచరణలోకి రావడం లేదు. ఎన్నికలప్పుడు లేనిపోని వాగ్దానాలు చేయడం, గెలిచి అధికారంలోకి వచ్చాక మొండిచేయి చూపించడం నాయకులకు అలవాటై పోయింది. నాయకులు చెప్పేవన్నీ ఉత్తుత్తిమాటలేనని ఎప్పుడో తేలిపోయింది. ప్రభుత్వాలు మారినా పాలకులు మారినా ఉదయగిరి తలరాత మాత్రం మారడం లేదు. అభివృద్ధి సంగతి ఇక ఎటూ జరిగేది లేదు కానీ, కనీసం కనీసవసతులన్నా ప్రజలకు దక్కుతున్నాయా లేదా అని పట్టించుకునే నాథులు లేరు. ఉదయగిరి పేరుకు చరిత్రాత్మక ప్రాంతమే తప్ప, ఇక్కడ జనానికి అన్నీ అవస్థలే. చివరికి మంచి రోడ్లు కూడా లేవు. ఏ రోడ్డు చూసినా అంతా గుంతలు మిట్టలే. వాహనాల రాకపోకలకు ఎంతో ఇబ్బందిగా ఉన్నా, అదే దారుల్లో అధికారులు, నాయకులు కారుల్లో వస్తుంటారు కానీ, రోడ్ల బాగు మాత్రం పట్టించుకోవడం లేదు. ఇక డ్రైనేజీ పరిస్థితి ఎంత అధ్వాన్నమో చెప్పలేం. చిన్న వానకే రోడ్లు మురుగు కాలువల్లా తయారవుతుంటాయి. ఎక్కడ చూసినా చెత్తకుప్పలు, మురుగుదిబ్బలతో చరిత్రాత్మక ఉదయగిరి గబ్బుకొట్టిపోతున్నా నాయకులు చోద్యం చూస్తున్నారే తప్ప దాని అతీగతీ పట్టించుకోవడం లేదు. ఎంతకాలం ఇలా?.. నాయకులంతా మేరునగధీరులే కానీ, జనం బాధలు పట్టించుకునేవారు ఒక్కరూ లేరు. జిల్లా కలెక్టర్, తదితర ఉన్నతాధికారులైనా ఉదయగిరి చరిత్రను గుర్తించి, ఈ పట్టణాన్ని ఎంతో కొంతమేరకైనా అభివృద్ధి చేయాలని, రోడ్లు, డ్రైనేజీల స్థితిగతులను పరిశీలించి వాటి బాగుకు చర్యలు తీసుకోవాలని విన్నపం.

జెఆర్ కోటి, ఉదయగిరి.




## దుర్గంధానికి మారుపేరుగా..
# నెల్లూరు ఆర్టీసీ బస్టాండ్

నెల్లూరు ఆర్టీసీ బస్టాండ్ నిత్యం ప్రయాణీకుల రద్దీతో ఉంటుంది. సంతోషం. అయితే, బస్టాండ్‌లో పరిశుభ్ర వాతావరణం కనిపించకపోవడం దురదృష్టకరం. ముఖ్యంగా బస్టాండ్‌లోని కసుమూరు ప్లాట్‌ఫాం దగ్గర మరుగుదొడ్ల నీరంతా వచ్చి అంతా దుర్గంధపూరితంగా ఉంది. ఎక్కడో ఆ మురుగునీళ్ళంతా లీక్ అవుతున్నాయి. ప్లాట్‌ఫాం దగ్గరకొస్తే చాలు, మురుగుగబ్బు కొడుతోంది. ఆర్టీసి ఉన్నతాధికారులు దయ చేసి ఆ లీకేజీని అరికట్టి దుర్గంధాన్ని నివారించ ప్రార్ధన.

– పోలిశెట్టి బాలకృష్ణ, (ప్రయాణీకుడు).

# 'యోగ'..భారత్‌కే గర్వకారణం

యోగ సాధన, ధ్యాన సాధన అనేవి భారత్‌లో పురాతన కాలం నుంచి వస్తున్న సత్సంప్రదాయాలు. ప్రాచీనకాలంలోని మహర్షులు వాటిని మనకు సాధించిపెట్టారు. అటు శరీర దారుఢ్యం, ఇటు మానసిక ఉల్లాసం కలిగేందుకు యోగ సాధన ఎంతగానో ఉపయోగపడుతుంది. ఆధ్యాత్మిక ప్రశాంతతకు ధ్యానం ఒక అద్భుతం. ఈనెల 21న యోగ దినోత్సవం అంతర్జాతీయస్థాయిలో ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్నదంటే ఎంత సంతోషమే చెప్పలేం. అది మనదేశం గొప్పదనానికి ఒక చక్కని నిదర్శనం. అయితే, రానురాను పాశ్చాత్య దేశాల ప్రభావంతో మనదేశ సంస్కృతి, సంప్రదాయాలు బలహీనమవుతున్న దశలో ఇప్పుడు ప్రపంచమంతా భారత్ వైపు చూస్తుండడం గొప్ప విషయం. ప్రపంచమంతా ఇప్పుడు యోగసాధనను అనుసరిస్తుండడం భారత్‌కే గర్వకారణం. నాటికీ నేటికీ కాదు, ఏనాటికైనా సరే భారత్ సంస్కృతి ఎంతో గొప్పది. మన సంప్రదాయాలను సంస్కృతిని మనం దానిని కంటికి రెప్పలా కాపాడుకోవడం మన విధి. మన చిన్నారులకు చిన్నతనం నుంచే యోగసాధన అలవాటు చేయడం తల్లితండ్రుల బాధ్యత. పాఠశాలల్లో గురువులు కూడా యోగను ప్రోత్సహించి విద్యార్థులకు వాటి పట్ల ఆసక్తిని కలిగిస్తే భావి భారతానికి కూడా ఎంతో ఉపయోగంగా ఉంటుంది. యోగ సాధన వల్ల విద్యార్థుల్లో ఏకాగ్రత పెరగడంతో పాటు జ్ఞాపకశక్తి కూడా మెరుగుపడుతుంది. ఎన్నో అనారోగ్యాల నుండి కూడా పిల్లలను కాపాడుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి పాఠశాలలో యోగా ఉపాధ్యాయులను నియమించి విద్యార్థులకు యోగలో శిక్షణనిస్తే మరింత బాగుంటుంది.

– ఎస్. శేషాద్రి, సంగం.

# వసుధైక కుటుంబ స్ఫూర్తిని ప్రతిబింబించేదే.. 'యోగా'

## - భారత ప్రభుత్వ క్షేత్ర ప్రచార అధికారి పరవస్తు నాగసాయి సూరి




మనదేశంలో ప్రాచీనకాలం నుంచి ఎందరో మహర్షులు, మహామునులు యోగసాధన చేసేవారని, లోకకల్యాణం కోసం ఆ ప్రాచీన యోగాను మనకు వారసత్వంగా అందజేశారని, యోగ అంటే వసుధైక కుటుంబ స్ఫూర్తికి ప్రతిబింబమని భారత ప్రభుత్వ క్షేత్ర ప్రచార అధికారి పరవస్తు నాగసాయి సూరి చెప్పారు. భారతీయ సంస్కృతిలో భాగమైన యోగాకు ప్రపంచమంతా నేడు గౌరవాన్ని అందిస్తోందని, ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ యోగను అభ్యసించి శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆయన సూచించారు. అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకుని వెంకటాచలంలోని సరస్వతినగర్‌లో ఉన్న అక్షర విద్యాలయంలో కేంద్ర ప్రభుత్వ సమాచార ప్రసార మంత్రిత్వశాఖ, స్వర్ణభారత్ ట్రస్ట్, అక్షర విద్యాలయం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులంతా ఎంతో ఉత్సాహంగా యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా అక్షరాల రూపంలో విద్యార్థులు చేసిన యోగ ప్రదర్శన అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శిశుసంక్షేమ కమిటీ ఛైర్‌పర్సన్ మాధవి మాట్లాడుతూ, విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి యోగ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. చిన్నతనం నుంచి యోగాను నిత్య జీవితంలో భాగం చేసుకోవటం ద్వారా మానసిక స్థిరత్వం లభిస్తుందని, తద్వారా జ్ఞాపకశక్తి, ఆలోచనా శక్తి పెరుగుతుందనే విషయాన్ని పరిశోధనలు సైతం రుజువు చేశాయని తెలిపారు. చదువుతో పాటు ఆటపాటలు, వ్యాయామం విద్యార్థుల వికాసానికి అవసరమనే విషయాన్ని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గుర్తించి అందుకు ప్రత్యేక సమయాన్ని వారికి అందించాలని సూచించారు. నిత్యం విద్యార్థులకు యోగాను నేర్పించేందుకు అక్షర విద్యాలయంలో ప్రత్యేక సౌకర్యాలు ఏర్పాటుచేశామని ఈ కార్యక్రమంలో పాల్గొన్న అక్షర విద్యాలయం ప్రిన్సిపల్ కుముద తెలిపారు. యోగా కోసం ప్రత్యేకంగా ఓ ఉపాధ్యాయుడిని కూడా నియమించి విద్యార్థులకు యోగాసనాలను నేర్పిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులంతా ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని కోరారు. అక్షర విద్యాలయం ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



## గౌరవపూర్వక కలయిక

రాజ్యసభ సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రీజినల్ కో-ఆర్డినేటర్ విజయసాయిరెడ్డిని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఇటీవల విజయవాడలోని ఆయన నివాసంలో గౌరవపూర్వకంగా కలసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కల్పలత రెడ్డి, వైఎస్‌ఆర్‌టియఫ్ నాయకులు జాలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 'దాహం దాహం' దీర్ఘకవిత పరిచయవేదిక జులై 2న




నెల్లూరుకు చెందిన ప్రముఖ కవి, ఆడిటర్ చిన్ని నారాయణరావు ఇటీవల రచించిన దీర్ఘకవిత 'దాహం దాహం' పరిచయ వేదిక కార్యక్రమం జులై 2 ఆదివారం నాడు స్థానిక పెన్నా రచయితల సంఘం(పెరసం) ఆధ్వర్యంలో జరుగనుంది. స్థానిక టౌన్‌హాలు ఏసీ రీడింగ్ రూమ్‌లో ఆరోజు సాయంత్రం 6.05 గంటలకు జరిగే సభలో ప్రముఖ నవలారచయిత్రి డాక్టర్ పెళ్ళకూరు జయప్రద సోమిరెడ్డి పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని, ప్రముఖ సాహితీ విమర్శకులు డా.మేడిపల్లి రవికుమార్ (తిరుపతి), ప్రముఖ కవులు శ్రీరామకవచం సాగర్, కలిమిశ్రీ, ఏటూరు నాగేంద్రరావు పాల్గొంటారని, పెరసం అధ్యక్షులు అవ్వారు శ్రీధరబాబు పుస్తక సమీక్ష చేయనున్నారని పెరసం నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా సాయంత్రం 4.30 నుంచి కవిసమ్మేళనం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. పెరసం కార్యదర్శి పాతూరి అన్నపూర్ణ. కవులు కంచనపల్లి ద్వారకానాథ్, ఏటూరి నాగేంద్రరావు, మోపూరు పెంచలనరసింహం, మద్దూరు శ్రీనివాసులు, బొగ్గరపు రాధాకృష్ణమూర్తిలను ఆత్మీయంగా సత్కరిస్తామని నిర్వాహకులు తెలిపారు. సభను గోవిందరాజు సుభద్రాదేవి, తోట సులోచన నిర్వహిస్తారని పేర్కొన్నారు.

# వివిఎస్‌యులో యోగా దినోత్సవం



నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో, నయాగో ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వారి సౌజన్యంతో ఈనెల 21న 9వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వివిఎస్‌యు ఉపకులపతి ఆచార్య జి.యం సుందరవల్లి ప్రారంభించారు. యోగ మరియు ఆయుర్వేదం అనే రెండు ముఖ్యమైన అంశాలు మన దేశ సాంప్రదాయకంగా ఎంతో ప్రాముఖ్యమైనవి అని ఆమె అన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి విశ్వవిద్యాలయంలో యోగా మీద ఒక ప్రత్యేకమైన 3 నెలల సర్టిఫికెట్ కోర్స్‌ను ప్రారంభించామని రిజిస్ట్రార్ ఆచార్య పి.రామచంద్రారెడ్డి అన్నారు. సర్టిఫైడ్ యోగ ప్రాక్టీషనర్ జి. నరేష్‌కుమార్ యోగా దినోత్సవం ప్రోటోకాల్‌లో ఉన్న వివిధ రకాల యోగాసనాలు వేసి చూపించారు. ప్రిన్సిపాల్ ఆచార్య జి.విజయ్ ఆనందకుమార్‌బాబు, సమన్వయకర్త డా. ఉదయ్‌శంకర్ అల్లం, పిఆర్‌ఓ డా. కోట నీలమణికంఠ, నయాగో ఎడ్యుకేషనల్ ట్రస్ట్ డైరెక్టర్ సాయి విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు

## నేతాజీ స్కూల్‌లో..



నెల్లూరులోని శ్రీ నేతాజీ పైలట్ స్కూల్‌లో ఈనెల 21న యోగా వేడుకలు జరిగాయి. స్కూల్ కరెస్పాండెంట్ ఎంవి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో యోగా ఉపాధ్యాయుడు, భగవద్గీత ప్రబోధక్ షేక్ నజీర్‌బాషా, పి.సుష్మ తదితరులు పాల్గొని యోగా విశిష్టతను విద్యార్థులకు వివరించారు. అనంతరం నజీర్‌బాషాను, సుష్మను పాఠశాల తరఫున ఘనంగా సన్మానించారు. పాఠశాల సీనియర్ డైరెక్టర్ కె.నరేంద్రరెడ్డి, డైరెక్టర్‌లు డా.సుబ్రామ్, డా. అలేఖ్య, ప్రిన్సిపాల్ సుభాషిణి, హెడ్మాస్టరు ఎస్‌వివిఎల్ నరసింహారావు పాల్గొన్నారు.

## కొండాయపాళెంలో...

నెల్లూరులోని కొండాయపాళెంలో ఉన్న నగరపాలక ప్రాథమిక పాఠశాలలో ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యం.భాస్కర్‌రావు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా మొదటి అంతర్జాతీయ యోగా దినోత్సవం 2015 జూన్ 21న నిర్వహించారని, అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని ప్రతి ఏటా జూన్ 21న జరుపుకుంటారని తెలిపారు. 2014 సెప్టెంబరు 27న భారత ప్రధాని నరేంద్ర మోడి ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం జూన్ 21న జరుపుకోవాలని చేసిన ప్రతిపాదనకు 193 మంది ఐరాస ప్రతినిధులలో 175 మంది మద్దతు ఇచ్చారని, దీంతో భారత్ యోగాకు అంతర్జాతీయ ఖ్యాతి వచ్చిందని, ఇది గర్వకారణమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు యోగాసనాలు వేశారు. హరీష్, రాశి తదితరులు పాల్గొన్నారు.

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

## కృష్ణపట్నం పోర్టు సీఈఓ



యోగాను సాధన చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంతో పాటు శారీరకంగా, మానసికంగా ఎంతో ఉల్లాసం కలుగుతుందని అదాని కృష్ణపట్నం పోర్టు సీఈవో జీజేరావు చెప్పారు. ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పోర్టులో యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పోర్టు ఉద్యోగులు, కార్మికులు ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఒత్తిడి లేని జీవన విధానం గడిపేందుకు యోగ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. యోగాకు పుట్టినిల్లు మనదేశమేనని, అన్ని వయసుల వారు యోగాతో మంచి ఆరోగ్యంతో పాటు రోగనిరోధక శక్తిని పెంపొందించుకునేందుకు బాగా దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పోర్టు సీఓఓ సంజయ్ కోత, అడ్మిన్ హెడ్ గణేష్ శర్మ, కార్పొరేట్ అఫైర్స్ హెడ్ జి.వేణుగోపాల్, హెచ్‌ఆర్ డీజీఎం సిహెచ్ శ్రీనివాస్, అడ్మిన్ ఏజీఎం గంగా సతీష్, గుడివాడ శ్రీకాంత్, రాజేష్ రంజన్, రామానంద్ యాదవ్, సెక్యూరిటీ డీజీఎం మనోహర్‌బాబు, పి శ్రీనివాసులు, వివిధ విభాగాల హెచ్‌ఓడిలు, ఉద్యోగ కార్మికులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు క్విజ్ పోటీలు

జి-20 కార్యక్రమాల్లో భాగంగా 8, 9, 10వ తరగతి విద్యార్థులకు పాఠశాల స్థాయిలో ఆర్థిక అక్షరాస్యతను అందించాలనే లక్ష్యంతో భారతీయ రిజర్వ్ బ్యాంక్ జాతీయస్థాయిలో 'ఆర్థిక అక్షరాస్యతపై పాఠశాల పిల్లలకు అఖిలభారత క్విజ్' నిర్వహిస్తోంది. జిల్లా కలెక్టర్ హరినారాయణన్ ఆదేశాలమేరకు, కెనరా బ్యాంక్ లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ టి. శ్రీకాంత్ ప్రదీప్‌కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి గంగాభవాని ఆధ్వర్యంలో ఈనెల 21న జిల్లాలోని మొత్తం 337 ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించిన అన్ని మండల కేంద్రాలలో క్విజ్ నిర్వహించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఇద్దరు విద్యార్థులు క్విజ్‌లో పాల్గొన్నారు. మండల స్థాయిలో పాల్గొన్న ప్రతి విద్యార్థికి సర్టిఫికెట్లు మరియు రూ.5000 నగదు ప్రోత్సాహంతో ప్రథమ బహుమతి, ద్వితీయ బహుమతి రూ.4000, తృతీయ బహుమతి రూ. 3000 నగదు బహుమతులు అందచేశారు. అన్ని మండలాల్లోని మొదటి బహుమతి విజేతలు ఈనెల 28న జరుగనున్న జిల్లా స్థాయి క్విజ్‌లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

# వాకర్స్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ



అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈనెల 21న నెల్లూరులోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో వాకర్స్‌కు, క్రీడాకారులకు 600 మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. వాకర్స్ ప్రతినిధులు నలుబోలు బలరామయ్యనాయుడు, తలపనేని హరిబాబు, బండి వేణుగోపాల్‌రెడ్డి, ముసునూరి పిచ్చయ్య, బిరదవోలు రామ్మోహన్‌రెడ్డి, ఎరమాక శ్రీనివాసులురెడ్డి, సదానందరెడ్డి, శ్రీమన్నారాయణ, మన్నేపల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు

## జెఇఇ మెయిన్స్‌లో...
## 'విశ్వసాయి' విజయదుందుభి




ఇటీవల ప్రకటించిన జెఇఇ అడ్వాన్స్ పరీక్షల్లో నెల్లూరులోని 'విశ్వసాయి' జూనియర్ కళాశాల విద్యార్థులు జాతీయస్థాయిలో మంచి ర్యాంకులు పొంది తమ సత్తాచాటుకున్నారు. పి.హృతిక్ జాతీయస్థాయిలో 112వ ర్యాంకు సాధించి అందరి అభినందనలు అందుకున్నారు. అదేవిధంగా ఆర్. ప్రశాంత్ 1931వ ర్యాంకు, పి. తనుశ్రీ 3315వ ర్యాంకు, ఎన్.శిశిర్‌రెడ్డి 3508 ర్యాంకు, వి.యజ్ఞశ్రీ 892వ ర్యాంకు, టి.యువదీప్ 1521వ ర్యాంకు సాధించి జాతీయస్థాయిలో విశ్వసాయి విజయపతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల ఛైర్మన్ డా.ఎస్ సత్యనారాయణ, వైస్ ఛైర్మన్ కృష్ణమోహన్‌లు అభినందించారు. క్రమశిక్షణ, సీనియర్ అధ్యాపకులు, అధ్యాపకేతరుల పర్యవేక్షణల వల్ల ఇంతటి విజయాలు సాధించ గలిగామని వారందరి సేవలను కొనియాడారు. కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, అధ్యాపకేతరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## శ్రీకృష్ణ యోగమందిరంలో.. 29న తొలి ఏకాదశి వేడుకలు

ఈనెల 29న తొలి ఏకాదశి సందర్భంగా నెల్లూరు దర్గామిట్టలోని సుజాతమ్మ కాలనీలో వెలసివున్న అవధూత దత్తపీఠం నెల్లూరు శాఖ ఆధ్వర్యంలోని శ్రీకృష్ణ యోగమందిరంలో స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహిస్తామని దేవస్థానం ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకల సందర్భంగా ఉదయాన్నే స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు, తులసార్చన, సాయంత్రం మహా హారతులు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా జులై 3న గురుపౌర్ణమి ఉత్సవాలు కూడా వైభవంగా నిర్వహిస్తామని, భక్తులు ఈ కార్యక్రమాలకు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామివార్లను దర్శించుకోవాలని ఆయన కోరారు.

## పట్టయ్య సేవలు చిరస్మరణీయం

విద్యాదాత, సమాజసేవాభిలాషి ఏనుగు పట్టాభిరామిరెడ్డి (పట్టయ్య) సేవలు చిరస్మరణీయమని, తన దాతృత్వంతో వేలాది మంది నిరుపేద విద్యార్థులకు ఆయన చదువు చెప్పించారని వక్తలు కొనియాడారు. ఈనెల 18న పట్టాభిరామిరెడ్డి 120వ జయంతి వేడుక నెల్లూరు రోటరీక్లబ్‌లో ఘనంగా జరిగింది. నెల్లూరు రోటరీక్లబ్ అధ్యక్షుడు కొండా శేఖర్‌రెడ్డి, ఇన్‌ఛార్జి సెక్రటరీ ఉదయభాస్కర్, కోశాధికారి ఏనుగు రమణారెడ్డితో పాటు సభ్యులు బాబు, అగస్టస్ పాల్గొన్నారు.

## 37 మంది ఉత్తమ విద్యార్థులకు..
## 'టౌన్‌హాలు ట్రస్టుబోర్డు' నగదు పురస్కారాలు



నెల్లూరులోని శ్రీ రేబాల లక్ష్మీనరసారెడ్డి పురమందిరం (టౌన్‌హాలు) ట్రస్టుబోర్డు ద్వారా ప్రతిఏటా నగర పరిధిలోని 37 ప్రభుత్వ పాఠశాలల్లో టెన్త్‌లో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు ఒక్కొక్కరికి 5వేల రూపాయల వంతున నగదు ప్రోత్సాహక బహుమతులు ఇవ్వడం ఆనవాయితీ. ఈ ఏడు కూడా వారి సారధ్యంలో ఉత్తమ విద్యార్థులకు ఈనెల 18న విశ్రాంత డెప్యూటీ కలెక్టర్ సిహెచ్ పెంచలరెడ్డి చేతులమీదుగా నగదు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేసి విద్యార్థుల్లో ఉత్సాహం నింపారు. టౌన్‌హాలు ట్రస్టుబోర్డు కార్యదర్శి జెఎస్‌రెడ్డి, సభ్యులు వాకాటి విజయకుమార్‌రెడ్డి, రేబాల ప్రవీణ్ కుమార్‌రెడ్డి, ఎంవి సుబ్బారెడ్డి, సి.వివేకానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం జ్ఞాననేత్ర స్వచ్ఛంద సేవాసంస్థ (గూడూరు) వారిచే జరిగిన సంగీత విభావరి అద్భుతంగా సాగి అందరినీ అలరించింది. గాయనీ గాయకులు కె.రాజా, ఎస్.శ్రీనివాస్, లావణ్య, జయలక్ష్మి, వాద్యకళాకారులు కిరణ్, వాసు ఈ సంగీత విభావరిలో పాల్గొని వీనులవిందుగా గానం చేసి అందరి కరతాళధ్వనులందుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారంతా దివ్యాంగులు కావడం, పలు టీవీ ఛానల్స్‌లో తరచూ పాల్గొనే ప్రముఖ గాయనీ గాయకులు, వాద్యకారులు కావడం విశేషం. అంతేకాదు, ఆ సేవాసంస్థ ద్వారా వారు పలు సేవా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తూ జీవితాలను సార్థకం చేసుకుంటున్నారు. కువైట్, మస్కట్ వంటి దేశాల్లో కూడా వీరి సంగీత విభావరులు శ్రోతలను మైమరపించాయి.

## తండ్రే మార్గదర్శకుడు
### • స్పాస్టిక్ సెంటర్‌లో ఘనంగా ఫాదర్స్ డే



నెల్లూరులోని ఐఆర్‌సిఎస్ ఎంఎస్‌ఆర్ స్పాస్టిక్ సెంటర్‌లో రాయల్ లియో లయన్స్ క్లబ్ ఆఫ్ నెల్లూరు వారిచే సెక్రటరీ లియో అభినవ్, ప్రెసిడెంట్ లియో వర్షిత‌ల ఆధ్వర్యంలో ఈనెల 18న స్పాస్టిక్స్ సెంటర్ బాలబాలికల తల్లిదండ్రులతో కలసి ఫాదర్స్‌డేని ఘనంగా నిర్వహించారు. పిల్లలకు క్రమశిక్షణతో కూడిన పెంపకంలో తండ్రి కృషి ఎనలేనిదని, పిల్లలు సమాజంలో ఉన్నతంగా రాణించేందుకు తండ్రి పడే తపన అనిర్వచనీయమైనదని, ప్రత్యేకించి స్పాస్టిక్ కేంద్రంలోని మానసిక వికలాంగులకు సంబంధించిన తల్లులకు, తండ్రుల సహకారం చాలా గొప్పదని వ్యక్తులు కొనియాడారు. స్పాస్టిక్ సెంటర్ ప్రిన్సిపాల్ గురునాథ రావు, మేనేజింగ్ కమిటీ సభ్యులు దాసరి రాజేంద్రప్రసాద్, ప్రెసిడెంట్ లియో వర్షిత‌ల కుటుంబంలోను, సమాజంలోనూ తండ్రుల పాత్ర ఎంత ఘనమైనదో వివరించారు. అనంతరం పలువురు తండ్రులను సముచితంగా సన్మానించారు.

## ఫీజుల దందా అరికట్టాలని ఏబీవీపీ డిమాండ్

జిల్లాలో ఫీజుల పేరుతో విద్యార్థులను, తల్లితండ్రులను నిలువుదోపిడీ చేస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలపై అధికారులు వెంటనే తగు చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈనెల 20న జిల్లా విద్యాశాఖ కార్యాలయం వద్ద వారు ఆందోళన చేపట్టారు. ఈ ఆందోళనలో ఏబీవీపీ నగర కార్యదర్శి యశ్వంత్, సహాయ కార్యదర్శులు నరసింహ, సాయి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చందు, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## 'తంగిరాల మహాభారతం' 60వ భాగం

ఈ వారం నుంచి సభాపర్వంలోకి అడుగు పెడదాము. మహాభారతంలో ఉన్న 18 పర్వాల్లో సభాపర్వం రెండవది. ఆదిపర్వంలో మనం కౌరవచరిత్ర చెప్పుకున్నాము. వైశంపాయనుడు జనమేజయ మహారాజుకు మహాభారతం వివరిస్తున్నాడన్నమాట.

హస్తి అనే మహారాజు పేరుమీద కౌరవ రాజధానికి హస్తినాపురం అనే పేరు వచ్చింది. కురు మహారాజు పేరుమీద కౌరవ వంశం అభివృద్ధి చెందింది. ఆ వంశంలో ప్రసిద్ధిచెందిన ప్రతీపుడు, అతని కొడుకు సంతనుడి నుంచి అర్జున సుభద్రలకు జన్మించిన అభిమన్యుడు వరకు ఆదిపర్వంలో చెప్పుకున్నాము.

అసలు ఈ పర్వానికి సభాపర్వమని వేదవ్యాసుడు ఎందుకు




పెట్టాడంటే... దీనిలో ఎక్కువ సంఘటనలన్నీ సభల్లోనే జరుగుతాయి. మయాసురుడు పాండవులకు నిర్మించిన మయసభ, దాన్ని చూసి ఓర్వలేని దుర్యోధనునికి ధృతరాష్ట్రుడు ఇంకో దివ్యమయిన సభను నిర్మించటం, నారద మునీంద్రుడు ముల్లోకాల్లో ప్రసిద్ధి చెందిన ఇంద్ర, వరుణ, యమ, కుబేర, బ్రహ్మ సభలను వర్ణించటం ఉంటాయి.

అన్ని పర్వాలకంటే సభాపర్వం కీలకమైనది. దుర్యోధనుడు మయసభలో ద్రౌపది నవ్విందని అవమానపడి, పాండవులను జూదానికి పిలిచి, శకునిచే వారిని ఓడించి, ద్రౌపదిని వస్త్రాపహరణం చేసి, పాండవులను అరణ్యాలకి పంపుతాడు. కౌరవ, పాండవుల సవాళ్లతో కురుక్షేత్ర యుద్ధానికి బీజం పడుతుంది.

భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది. పూర్తి నిడివి కోసం Syam Tangirala Mahabharatam @YouTubeలో చూడగలరు.




## రవాణాశాఖ దాడులు

జిల్లాలో పలుచోట్ల అనధికార షోరూమ్‌లలో బైక్‌లు విక్రయిస్తున్నారన్న ఫిర్యాదులు రావడంతో రవాణాశాఖ అధికారులు కొరడా ఝుళిపించారు. ఉప రవాణా కమిషనర్ చందర్ ఆదేశాలతో ఈనెల 20న అధికారులు దాడులు నిర్వహించారు. తిరుపతిలో డీలర్‌షిప్ ఉండి నెల్లూరు మినీబైపాస్‌రోడ్డులో అనధికార షోరూమ్‌లు ఏర్పాటుచేసి నకిలీ బిల్లులతో బైక్‌లు విక్రయిస్తున్నట్లు అధికారులు ఈ దాడుల్లో గుర్తించడమే కాక, 29 బైక్‌లను సీజ్ చేశారు. వాటి చాయిస్, ఇంజన్ నంబర్లను అధికారులు రాష్ట్ర రవాణాశాఖ కమిషనర్‌కు పంపనున్నట్లు సమాచారం. ఈ దాడుల్లో మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ కార్తీక్‌పవన్, ఏఎంవిఐలు పూర్ణచంద్రరావు, స్వప్నిల్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## కరాటేలో గుణిష్క అపూర్వ ప్రతిభ
### • అంతర్జాతీయ పోటీల్లో రజత పతకం



నెల్లూరు మాగుంట లే-అవుట్‌లో ఉన్న విశ్వసాయి డాక్టర్ ఎస్‌ఆర్‌కె పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న గుణిష్క అంతర్జాతీయ కరాటే పోటీల్లో సత్తా చూపి పతకం సాధించింది. ఇటీవల నేపాల్‌లో జరిగిన 9వ మౌంట్ ఎవరెస్ట్ అంతర్జాతీయ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో భారత్ తరపున పాల్గొని రజత పతకాన్ని సాధించడం విశేషం. ఈ పోటీలను నేపాల్ షిటోర్యు కరాటే డో ఖాట్మాండు అసోసియేషన్ వారు నిర్వహించారు. అంతర్జాతీయ కరాటే పోటీల్లో అపూర్వ ప్రతిభతో రాణించిన గుణిష్కను ఈనెల 20న పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ జి.కృష్ణమోహన్, ప్రిన్సిపాల్ ఎస్.రఘురామ్‌లు అభినందించారు. గుణిష్క కరాటేలో మరెన్నో విజయాలు సాధించాలని పాఠశాల ఛైర్మెన్ డాక్టర్ ఎన్ సత్యనారాయణ ఆకాంక్షించారు.

# రూరల్‌లో రౌడీయిజం లేకుండా చేస్తా!

## ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి



నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో రౌడీయిజం లేకుండా చేస్తానని నెల్లూరు ఎంపీ, నెల్లూరు రూరల్ వైకాపా ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్ రెడ్డి చెప్పారు. స్థానికులు ఎవరూ రౌడీయిజాన్ని సహించరని, రూరల్‌లో ఎక్కడ చిన్న అవాంఛనీయ సంఘటన జరిగినా తన దృష్టికి తేవాలని కోరారు. ఇటీవల ఆయన 28వ డివిజన్లోని శాంతినగర్ 1వ వీధిలో సిమెంట్ రోడ్డుకు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆ డివిజన్ ఇన్‌చార్జ్ మదన్ మోహన్‌రెడ్డి ఎంపీగా ఆదాల నాలుగేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా ఆదాల మాట్లాడుతూ, నియోజకవర్గ అభివృద్ధి కోసం 20 కోట్ల రూపాయలను అడిగిందే తడవుగా సీఎం మంజూరు చేశారని చెప్పారు. ఎంపీగా నాలుగేళ్లలో జిల్లాకు ఎన్నో నిధులు తీసుకొచ్చానని, మినీ బైపాస్‌లో ఫ్లైఓవర్, బైపాస్‌లో మూడు ఫ్లైఓవర్లు మంజూరు చేయించానని చెప్పారు. నెల్లూరు రైల్వే స్టేషన్ కు 100 కోట్ల రూపాయల నిధులను తీసుకొచ్చానని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి సాధారణంగా వచ్చే నిధులు కాకుండా అనేక శాఖల నుంచి అదనంగా నిధులు మంజూరు చేయించానని తెలిపారు. డిసిసిబి మాజీ చైర్మన్ ఆనం విజయ కుమార్‌రెడ్డి, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, కార్పొరేటర్లు అవినాష్, సత్తార్, వైసీపీ నేతలు స్వర్ణ వెంకయ్య, కోటేశ్వర్‌రెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, రియాజ్, రాజేష్, హరిబాబు యాదవ్, నరసింహులు గౌడ్, సూరిబాబు పాల్గొన్నారు.

### పథకాలు అందని వారిలో కూడా సంతృప్తి

పథకాలు అందని వారిలో సైతం ముఖ్యమంత్రి సీఎం జగన్మోహన్‌రెడ్డి పాలన పట్ల సంతృప్తి వ్యక్తం అవుతోందని ఎంపీ ఆదాల చెప్పారు. 18వ డివిజన్లో కార్పొరేటర్ అశోక్ ఆధ్వర్యంలో ఇటీవల ఆయన 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ, ఈ ప్రాంతంలో మధ్యతరగతి, ఎగువమధ్య తరగతి ప్రజలు ఎక్కువగా ఉన్నారని, వారికున్న వసతులను బట్టి పథకాలు అందని వారు సైతం రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పట్ల సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.



## పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో బిఎంఆర్

ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన వ్యవసాయం, పశుసంవర్ధక, మత్స్య శాఖ, ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రిత్వశాఖల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో సభ్యులైన రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు (బిఎంఆర్) పాల్గొని ఆక్వా కల్చర్ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. పలువురు పార్లమెంట్ సభ్యులు పాల్గొన్న ఈ సమావేశంలో వ్యవసాయ మంత్రిత్వ శాఖలోని వివిధ విభాగాలైన వ్యవసాయం, రైతుల సంక్షేమం, వ్యవసాయ పరిశోధనా విభాగం, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు, మత్స్యశాఖ తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు. స్టాండింగ్ కమిటీకి సమర్పించిన కోస్టల్ ఆక్వాకల్చర్ అథారిటీ (సవరణ) బిల్లు 2023 ముసాయిదాపై ఈ సమావేశంలో వారు చర్చించారు.

## విద్యార్థులకు...

# రామ్ చేతులమీదుగా ప్రతిభా పురస్కారాలు



'జగనన్న ఆణిముత్యాలు' పేరుతో ఇటీవల వెంకటగిరిలోని అడ్డరోడ్డు వద్ద ఉన్న పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డ్ ఛైర్మెన్, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులకు క్రమశిక్షణ అవసరమని పోటీతత్వంతో విద్యార్థులు చదువుకుని సమాజంలో ఉత్తమస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల భవితవ్యం కోసం, విద్యారంగంలో వారిని మరింతగా ప్రోత్సహించడం కోసం రాష్ట్రముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు అమలుచేస్తున్నారని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామ్‌కుమార్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కౌన్సిలర్లు, మండల స్థాయి అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేయాలి

## జడ్పీ స్టాండింగ్ సమావేశాల్లో ఆనం అరుణమ్మ



గ్రామీణ ప్రజల అభ్యున్నతి ధ్యేయంగా అందరూ కష్టపడి పనిచేయాలని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు క్షేత్రస్థాయిలో పటిష్టంగా అమలు జరిగేలా అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ సూచించారు. ఈనెల 19న నెల్లూరులోని జడ్పీ సమావేశ మందిరంలో జరిగిన స్టాండింగ్ కమిటీల సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో నెలకొని ఉన్న పలు సమస్యలను స్థాయి సంఘాల సభ్యులు జడ్పీ ఛైర్‌పర్సన్ దృష్టికి తీసుకువచ్చారు. అందుకు ఆమె స్పందిస్తూ సభ్యులు సమావేశంలో తెలిపిన సమస్యలను పరిశీలించి త్వరిత గతిన పరిష్కరించేలా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వివరాలను సంబంధింత జడ్పీటీసీ సభ్యులకు, ఇతర ప్రజా ప్రతినిధులకు కచ్చితంగా తెలియచేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. అనంతరం వ్యవసాయం, విద్య, వైద్యం తదితర రంగాల పురోగతిని ఆమె సమీక్షించారు. శాసన మండలి సభ్యులు పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా పరిషత్ వైస్ ఛైర్మెన్ శ్రీహరికోట జయలక్ష్మమ్మ, సి.ఈ.ఓ చిరంజీవి, డ్వామా పీడీ వెంకటరావు, హౌసింగ్ పీడీ నరసింహం, మత్స్యశాఖ జేడీ నాగేశ్వర రావు, అధికారులు, జడ్పీటీసీలు పాల్గొన్నారు.

## రామలింగేశ్వరుని సేవలో రజత్‌కుమార్‌రెడ్డి



కోవూరు నియోజకవర్గం, విడవలూరు మండలం రామతీర్థంలో ఇటీవల జరిగిన కామాక్షిదేవి సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామి-అమ్మ వార్ల కళ్యాణోత్సవంలో పాల్గొన్న కోవూరు నియోజకవర్గ యువజన విభాగం కమిటీ అధ్యక్షులు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి. పక్కన, ఆవుల శ్రీనివాస్ (వాసు), మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు.




మనఃపూర్వక ధన్యవాదాలు







అమ్మ భాషని అవపోసన పట్టిన
పుణ్యజీవి, ధన్యజీవి మా మామ
కీ॥శే॥ మోపూరు వేణుగోపాలయ్య స్మారక సాహితీ సంచిక
ఆవిష్కరణలో పాల్గొన్న భారత 13వ ఉపరాష్ట్రపతి
ముప్పవరపు వెంకయ్యనాయుడు గారికి
కోడూరు ఈశ్వర వరప్రసాద్‌రెడ్డి గారికి
మన్నెం వెంకటరాయుడు గారికి
'ప్రవచన సుధాకరుని'
'వేణు'నాదం
సంచికని ప్రయోగాత్మక సాహితీ విపంచికగా,
గురు సంస్మరణ జ్ఞాపికగా తీర్చిదిద్దిన
వేణుగోపాలయ్య గారి ఆత్మీయ బృందానికి
హృదయపూర్వక ధన్యవాదాలు.

గోవర్ధన్‌రావు నిడిగంటి
సభ్యులు
నాటా ప్రత్యేక సంచిక - 2023 కార్యనిర్వాహక కమిటీ
నాటా సాహిత్య వేదిక
డల్లాస్ - యు.ఎస్.ఏ.

# ఆత్మీయ గురువుకు..అద్వితీయ నివాళి


పుస్తక పరిచయం

## గురువుకు శిష్యుల అపురూప జ్ఞాపిక.. శ్రీ మోపూరు వేణుగోపాలయ్య స్మారక సాహితీ సంచిక

**'మోపూరు వేణుగోపాలయ్య'.. ఎవరీయన?.. మొన్నటి దాకా ఆయనో సాధారణ అధ్యాపకుడు. నెల్లూరు వీఆర్ కళాశాలలో తెలుగు అయ్యవారు. జీవితమంతా అధ్యాపకత్వంలో, అనిర్వచనీయమైన ఆధ్యాత్మికత్వంలో చరించి..తరించిన సౌజన్యమూర్తి. ఎప్పుడూ తన లోకమేదో తనది అన్నట్లుగా ఉండే పరమసాత్వికుడు. ఎందరో విద్యార్థులకు పాఠాలే కాదు..జీవితపాఠాలు కూడా చెప్పారు. మరెందరో గురువులకు కూడా ఆయన గురువు. అయినా.. తానేదో గొప్ప గురువుననే భావం కానీ, అహంభావం కానీ ఆయనలో ఉండవు. ఎలాంటి ప్రచారార్భాటాలు ఆయనకు నచ్చవు. ఇంత మంచి గురువు ఉండడం కూడా ఒక అదృష్టమే. కానీ, ఆ భాగ్యాన్ని కరోనా రాకాసి మనకు లేకుండా చేసింది. ఆయన్ని మనకు దూరం చేసింది.**

అయితే, ఆయన స్వర్గీయులైన తర్వాత..ఎవరూ ఊహించని విధంగా ఆయనకు అపురూపమైన ఖ్యాతి లభించడం విశేషం. అందుకే, ఇప్పుడాయన పేరు తెలుగుసారస్వత లోకంలో మారుమోగిపోతోంది. నిజంగా..ఇలా జరుగుతుందని ఆయనెప్పుడూ కలలో కూడా ఊహించివుండరు. తాను భౌతికంగా లేక పోయినా..తనపేరుతో ఒక అపురూపమైన సాహితీ సంచిక వస్తుందని, అందులోనూ దానిని సాక్షాత్తూ తన శిష్యుడైన భారత 13వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యానాయుడే వచ్చి ఆవిష్కరిస్తారని ఎప్పుడూ అనుకోని కూడా ఉండరు. తెలుగువారికి వరప్రసాదమైన 'పద్మభూషణుడు' వరప్రసాద్‌రెడ్డి వస్తారని, అక్షరాలే హృదయస్పందనలుగా భావించే 'మనసు'న్న మంచిమనిషి ఎంవి రాయుడు వచ్చి ఆ సంచికను సమీక్షిస్తారని ఆయనే కాదు, ఎవరూ ఊహించలేదు. కానీ, ఆ అద్భుతమంతా జరగనే జరిగింది. జీవితాంతం సాహితీసేవలో పునీతమై.. 'తిక్కన భగవద్గీత' వంటి విశిష్ట రచనలతో తెలుగు భాషామతల్లికి అక్షరహారతులర్పించిన ఆ సారస్వత మూర్తికి అనుకోని అపూర్వమైన విఖ్యాతి లభించింది. ఇదంతా శిష్యులు చేసిన అద్భుతం. 'గురువంటే అలా ఉండాలి..శిష్యులంటే ఇలా ఉండాలి' అనే విధంగా, తమ ఆత్మీయ గురువుకి..శిష్యులు అద్వితీయంగా నివాళులర్పించారు. ఆ సాహితీమూర్తిని నిండుగుండెతో అక్షరసుమాలతో అర్చించారు. ఆ అక్షరస్వరాలే 'వేణు'నాదమై సాహితీలోకాన్ని పరవశింపజేస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగానే కాదు, దేశవ్యాప్తంగా సాహితీవేత్తల హృదయాల్లో ఆ సారస్వత సౌరభాలు గుబాళిస్తున్నాయి. 'ప్రవచన సుధాకరుని'గా బిరుదునందుకున్న వేణుగోపాలయ్య స్మారకంగా నెల్లూరులోని కస్తూరిదేవి విద్యాలయం ప్రాంగణంలోని విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ ఆడిటోరియంలో ఇటీవల ఆవిష్కృతమైన ఈ సాహితీ సంచికలో ప్రతి అక్షరం.. ఒక ఆణిముత్యమై మెరిసి పోయింది. తెలుగుతల్లి మురిసిపోయింది. ఎన్నెన్నో విశిష్టతలున్న ఈ సాహితీ విపంచిక..గురువుకు శిష్యుల అపురూప జ్ఞాపిక! ఒక్కమాటలో చెప్పాలంటే 'కవిబ్రహ్మ తిక్కనపుట్టిన గడ్డ మీద నుంచి తెలుగు సాహితీలోకానికి అందిస్తున్న ఒక అద్భుతమైన కానుక!...

స్వర్గీయ వేణుగోపాలయ్య గారి స్మారక సాహితీ సంచికగా వెలువడిన "ప్రవచన సుధాకరుని 'వేణు'నాదం"..అనే మూడువందల పేజీలున్న ఈ పుస్తకంలో అన్నీ ప్రత్యేకతలే. ఇటు నెల్లూరుజిల్లా నుంచి, అటు రాష్ట్రం నలుమూలల నుంచి ఎందరో లబ్దప్రతిష్టులైన రచయితలు, పరిశోధకులు, కవులు, రచయిత్రులు వివిధ రకాలైన వ్యాసాలతో ఈ పుస్తకాన్ని పరిపుష్టం చేశారు. విమర్శ, పరిశోధన, జానపదం, ఆధ్యాత్మికం, కవిత్వం, చరిత్ర, నాటకం, నవల, చాటువులు, పేరడీలు, ప్రహేళికలు, హాస్యం, కరోనా సాహిత్యం వంటి అపురూపమైన అంశాలన్నిటినీ రచయితలు అక్షరాల్లో ఏర్చికూర్చి పొది గారు. భారత పూర్వ ఉపరాష్ట్రపతి, మన నెల్లూరు ముద్దుబిడ్డ, మోపూరు వేణుగోపాలయ్య గారికి శిష్యులైన ముప్పవరపు వెంకయ్యనాయుడు ఈ పుస్తకంలో 'సత్సంగత్వే నిస్సంగత్వం' అనే వ్యాసంలో గురువంటే మోపూరు వేణుగోపాలయ్యగారిలా ఉండాలి.. అని ఘనంగా అక్షర నివాళులర్పించారు. 'తెలుగు భాష వైశిష్ట్యం-వైభవం' గురించి కెఐ వరప్రసాద్‌రెడ్డి, గానగంధర్వుడు ఎస్పీ బాలు తత్వాన్ని, మనస్తత్వాన్ని విశ్లేషిస్తూ డా. మండలి బుద్ధప్రసాద్, అసాధారణ నెల్లూరు పత్రికల గురించి డా. ఆర్. అనంతపద్మ నాభరావు, కవికోకిల దువ్వూరు రామిరెడ్డి రచనల విశిష్టతలను మెట్టు రామచంద్రప్రసాద్, 'మహాభారతంలో మానవుడు' అంటూ డా.అప్పజోడు వెంకటసుబ్బయ్య, తెలుగులో చాటుపద్య సౌందర్యం గురించి డా. సంగనభట్ల నరసయ్య, విజ్ఞాన సర్వస్వాల గురించి డా. గుంజి వెంకటరత్నం, ప్రాచీనాంధ్ర సాహిత్యంలో విశేషాలను ప్రముఖ సారస్వత వేత్త ఆర్‌వీఎస్ సుందరం, 'తెలుగుమాట' గురించి.. ప్రొ.కెఎస్ చలం, 'నవలా వికాసం' గురించి అంపశయ్య నవీన్, 'తెలుగుభాష అందచందాల'ను వర్ణిస్తూ డా.బత్తుల శ్రీరాములు, 'గాడి తప్పుతున్న మన విద్యారంగం' గురించి పూర్వ శాసనమండలి సభ్యులు విఠపు బాలసుబ్రహ్మణ్యం, పిరదౌసి కావ్యానుశీలనం గురించి ఏనుగు నరసింహారెడ్డి, 'ఆనందమే జీవితం' అంటూ సీబి సీఐడి అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్(లక్నో) కిల్లాడి సత్యనారా యణ, 'అన్నప్రదాత ఆదిత్యుడు' అంటూ ప్రాచార్య శలాక రఘునాథశర్మ, సింహపురి సీమలో రక్తసహాయోద్యమం గురించి రక్తదాత తిక్కవరపు సుకుమార్ రెడ్డి, జానపద వాఙ్మయం గురించి టి.రమణయ్య, విద్యాదాత ఏనుగు పట్టాభిరామిరెడ్డి గురించి కొండా వెంకటస్వామి... ఇలా ఒకటా రెండా... అక్షరాలా అరవై వ్యాసాలు ఈ పుస్తకానికి వెల కట్టలేని మణిహారాలు. అంతేకాదు, ఎంతో అరుదైన గుంటూరులోని 'అన్నమయ్య గ్రంథాలయం', మనసు ఫౌండేషన్‌వారు తెలుగుభాషకు చేస్తున్న అత్యద్భుతమైన అక్షరసేవ, స్వాతంత్ర్యోద్యమంలో నెల్లూరులో వెలుగొందిన గోడపత్రిక గురించి సీనియర్ పాత్రికేయుడు రాఘవ శర్మ, నెల్లూరుజిల్లాలో పురుడుపోసుకుని రాష్ట్రాన్నంతా ఒక ఊపు ఊపిన 'సాక్షరతా ఉద్యమం 'అక్షరదీపం'..సారా ఉద్యమాల చరిత్ర' గురించి జి.మాల్యాద్రి, నెల్లూరు జైనబౌద్ధాల గురించి డా. గంగిశెట్టి శివకుమార్ తదితరులు రాసిన వ్యాసాలు ఎంతో విశిష్టమైనవి. ఇంకా, తిక్కన వంశవృక్షం గురించి విఆర్‌సి విశ్రాంత ప్రిన్సిపాల్ డా. మర్మావుల సుబ్రహ్మణ్యం విశ్లేషణాత్మక వివరణ భావి పరిశోధకులకు దిక్సూచి లాంటిది. తొలి తెలుగు వాగ్గేయకారుడు అన్నమయ్య, మహాకవి తిక్కన, మహాకవయిత్రి మొల్లమ్మ, యుగకవి శ్రీశ్రీ, సహజకవి మల్లెమాల, కవికోకిల గుర్రం జాషువా, తెలుగజాతి గర్వించే కవులు శరత్, చలం, కాసుల పురుషోత్తమ కవి తదితరుల గురించిన వ్యాసాలు, ఆంధ్రరాష్ట్ర కోసం అసువులు బాసిన అమరజీవి పొట్టి శ్రీరాములు, స్వాతంత్ర్యసమరయోధుడు వెన్నెలకంటి రాఘవయ్య, చరిత్రకారుడు ఎన్నెస్ కృష్ణమూర్తి (ఎన్నెస్కే) తదితర స్ఫూర్తిదాయకమైన మహనీయుల గురించి రాసిన వ్యాసాలు ప్రతిఒక్కరూ చదువతగ్గవి. మోపూరు వేణుగోపాలయ్య గారి జీవితం, విశేషాలతో పాటు, ఆయన రచించిన 'తిక్కన భగవద్గీత'ను ఇందులో పునర్ముద్రించడంతో ఆ గ్రంథానికి మరింత శాశ్వతత్వం చేకూరింది. ఏదేమైనా ఈ పుస్తకం తెలుగు సాహితీ లోకంలో కొత్త వెలుగులు ప్రసరింప జేస్తుండడం నెల్లూరుసీమకే కాదు...తెలుగు సారస్వత సీమకే గర్వకారణం.




### ఇవీ ప్రత్యేకతలు :

- అందమైన ముఖచిత్రం
- 300 పేజీలు..
- 30 మంది నీరాజనాలు
- 60 అద్భుతమైన వ్యాసాలు
- అందరూ సుప్రసిద్ధ రచయితలే
- అందులో 35 మంది పీహెచ్‌డీలు
- మరో 8 మంది మహిళల వ్యాసాలు
- 18 సాహితీ ప్రక్రియల ప్రస్తావన
- మహాకవి తిక్కన - వంశవృక్షం
- 'వెల'..కట్టలేనంత!

– వేదశ్రీ, హైదరాబాద్.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

## సి.ఆర్.రెడ్డి ఆసరా



ఈనెల 18వతేదీన గూడూరులోని డిఎన్‌ఆర్ కమ్యూనిటీ హాల్లో సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ సి.ఆర్.రెడ్డి ఆసరా పథకాన్ని నిర్వహించారు. వివిధ మండలాల నుంచి వచ్చిన 20 మంది రెడ్డి బంధువులకు డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డి – డాక్టర్ రోహిణిలు ఒక నెల సరిపడా పలసరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రోహిణి మాట్లాడుతూ సేవా కార్యక్రమాలను నిర్వహించడం వల్ల కలిగే సంతృప్తిని వెలకట్టలేమన్నారు. భవిష్యత్తులో కూడా ఈ కార్యక్రమానికి ఎటువంటి అడ్డంకులు లేకుండా తమ వారసులు కొనసాగిస్తారన్నారు. రవీందర్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, శివరామిరెడ్డి, ప్రజేందర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలను ఇబ్బంది పెడితే చర్యలు

సమస్యలపై సుదూర ప్రాంతాల నుంచి వచ్చే అర్జీదారుల నుంచి వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని గూడూరు గ్రామీణ సి.ఐ జి.దశరథరామారావు హెచ్చరించారు. గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయ సముదాయం బయట రోడ్డు పక్కన అర్జీలు రాసేవారిని ఆయన హెచ్చరించారు.



వెంకటగిరి నియోజకవర్గంలోని డక్కిలిలో జరుగుతున్న 'యువగళం' పాదయాత్రలో ఈ నెల 21వ తేదీ నారా లోకేష్‌తో కలిసి నడుస్తున్న నెల్లూరుజిల్లా టిడిపి కార్యదర్శి శ్రీనివాసచౌదరి.

## గురుకులంలో జన్మదిన వేడుకలు

శ్రీకృష్ణ సేవాసమితి అధ్యక్షులు, సౌత్ సెంట్రల్ రైల్వే విజయవాడ డివిజన్ డిఆర్‌యుసిసి సభ్యులు, రొటేరియన్ డాక్టర్ శ్యామసుందరరావు (మయూరి శ్యామ్‌యాదవ్) దాతృత్వంలో ఏపిటిడబ్ల్యూఆర్ మినీ గురుకులంలో రోటరీ క్లబ్ వెస్ట్ ఆధ్వర్యంలో ప్రతి నెలా క్రమం తప్పకుండా జరిగే సామూహిక జన్మదిన వేడుకలను ఈ నెల 19న నిర్వహించారు. ఆరుగురు విద్యార్థినుల చేత భారీ కేక్‌ను కట్ చేయించి వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. రోటరీ క్లబ్ వెస్ట్ అధ్యక్షుడు ధనంజయరెడ్డి, రొటేరియన్స్ హరినాథ్‌రెడ్డి, వాసుగౌడ్, సుబ్రమణ్యం, బలరాంరెడ్డి, మినీ గురుకులం హెడ్‌మాస్టర్ ప్రియాతి మేరీ పాల్గొన్నారు.

## క్రీడా సామగ్రి వితరణ



గూడూరు పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిరంలో ఈ నెల 21న లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గూడూరు పంచాయతీ రాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గిరినాథ్ దాతృత్వంతో 20 వేల రూపాయల విలువచేసే క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. అనంతరం పేదలకు దుస్తులు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కేక్ కట్ చేసి అందరికి పంచి పెట్టారు. లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ ఛైర్మెన్ షేక్ రియాజ్ అహ్మద్, క్లబ్ అధ్యక్షుడు కళ్యాణసాయి, డిస్ట్రిక్ట్ ఛైర్మెన్లు, సభ్యులు, శిశు మందిరం ప్రధానోపాధ్యాయులు రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి ముఖాముఖి

గూడూరు డివిజన్‌లోని గూడూరు, కోట, వెంకటగిరి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, ఆయాల పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 20వ తేదీ ఆర్డీవో కిరణ్‌కుమార్ ముఖాముఖి నిర్వహించారు. ఐసిడిఎస్ పి.డి జయలక్ష్మి, సీడీపీవోలు పాల్గొన్నారు. నాలుగు అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులకు 15మంది దరఖాస్తు చేసుకోగా, 11 ఆయా పోస్టులకు 22 మంది హాజరయ్యారని వారు తెలిపారు.



## 'ఆరోగ్యమిత్ర'లను అభినందించిన కలెక్టర్

జిల్లాలో ఆరోగ్య మిత్రలుగా మంచి సేవలు అందించిన ఇద్దరిని జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్ అభినందించారు. ఈ మేరకు వైయస్సార్ హెల్త్ కేర్ ట్రస్ట్ నుండి సిఇఓ పంపిన 5000 రూపాయల చెక్కులను, ప్రశంసా పత్రాలను కలెక్టర్ సోమవారం తిక్కన ప్రాంగణంలో వారిద్దరికి కలెక్టర్ అందజేశారు. వైద్య అవసరాల కోసం వచ్చే పేద ప్రజలకు ఆరోగ్య మిత్రలు అందరూ మంచి సేవలు అందించాలని కలెక్టర్ ఈ సందర్భంగా చెప్పారు. నెల్లూరు జిజిహెచ్‌లో ఆరోగ్య మిత్రగా పనిచేస్తున్న దీప్తికి ఏప్రిల్ నెలకుగాను, కావలి పట్టణంలోని కందుకూరి ఆసుపత్రిలో ఆరోగ్య మిత్రగా పనిచేస్తున్న శిరీషకు మే నెలకు గాను వారి పనితీరును పరిగణనలోకి తీసుకుని వారికి నగదు బహుమతులందించారు. వైయస్సార్ హెల్త్‌కేర్ ట్రస్ట్ జిల్లా కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మోపూరు పావని స్మారక అవార్డులు



నెల్లూరులోని ప్రముఖ కార్టూనిస్టు రామశేషు కుమార్తె స్వర్గీయ మోపూరు పావని స్మారకార్థం ఇటీవల పలువురు బాలలకు పురస్కారాలను ప్రదానం చేశారు. సృజనాత్మకత కలిగిన ఆరు రంగాలలో ప్రతిభ కలిగిన బాలలకు ఒక్కొరికి 1000 రూపాయల నగదు పురస్కారంతో పాటు, శాలువా-జ్ఞాపికలతో సత్కారాలు జరిగాయి. నెల్లూరు బాలభవన్ డైరెక్టర్ గోవిందరాజు సుభద్రాదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శిఖరం నందన (శాస్త్రీయ సంగీతం), సుదీప (శాస్త్రీయనృత్యం), వావిళ్ళ ప్రశాంతి (క్రీడారంగం) నెల్లూరు హారిక (చిత్రలేఖనం), బి.శ్రావ్య (మోడరన్ డ్యాన్స్) పురస్కారాలు అందుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారి సుదీప నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. స్థానిక మిలిటరీ కాలనీలోని మోపూరు వారి ఆవరణలో ఈ కార్యక్రమం జరిగింది. ఎంఎస్ఆర్ ట్రస్ట్ అధినేత మోపూరు రామ్‌గోపాల్, ప్రముఖ కవి మోపూరు పెంచలనరసింహం, మోపూరు శ్రీనివాసు కుటుంబ సభ్యులతో పాటు కవులు అవ్వారు శ్రీధరబాబు, ఈతకోట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల భవితకు బాటలు వేసేది..నాన్నే



ప్రతి తండ్రి తన పిల్లల భవితవ్యానికి బాటలు వేస్తాడని, పిల్లల దృష్టిలో నాన్నే ఒక గొప్ప హీరో అని పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్‌రాజు అన్నారు. ఈనెల 18న పితృదినోత్సవం(ఫాదర్స్ డే) సందర్భంగా నెల్లూరులో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బిడ్డల పట్ల నాన్న చూపే అభిమానం ఎంత గొప్పదో వివరించారు. మనల్ని పెద్దచేసి ప్రయోజకుల్ని చేసిన నాన్నలను ఈరోజున గౌరవించు కోవడం సముచితంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ స్వచ్ఛంద సంస్థల ఐక్యవేదిక అధ్యక్షులు తమ్మినేని పాండు, గౌతమ బుద్ధ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు అరవ రాయప్ప, మోటివేటర్ టి. వెంకటేశ్వర్లు, విద్యార్థులు కె.లీలాక్షణ, షేక్ రహీమున్నిసా, కె.మేఘనతో పాటు పలువురు తండ్రులు పాల్గొన్నారు.

### రక్తదానం చేయండి..

# ప్రాణదాతలుగా మారండి

**- కృష్ణపట్నం పోర్టు సిఇఓ జీజేరావు**



రక్తదానం ప్రాణ దానంతో సమానమని, రక్తదానంపై అవగాహన పెంచుకుని ప్రతిఒక్కరూ రక్తదానం చేసి బాధితుల ప్రాణాలు కాపాడాలని అదాని కృష్ణపట్నం పోర్టు సిఇఓ జీజేరావు ఉద్యోగ కార్మికులకు పిలుపునిచ్చారు. పోర్టు ఆధ్వర్యంలో ఈనెల 20న రెడ్‌క్రాస్ సహకారంతో నిర్వహించిన మెగా వైద్యశిబిరానికి ఆయన ముఖ్యఅతిథిగా వచ్చి, సిఓఓ సంజయ్, అడ్మిన్‌హెడ్ గణేశ్‌శర్మతో కలిసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రక్తదానం ద్వారా మరొకరి ప్రాణాలు నిలబెట్ట వచ్చున్నారు. పోర్టు సామాజిక బాధ్యతలో భాగంగా ప్రతిఏటా మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటుచేస్తున్నామని, ఎందరో ఉద్యోగ కార్మికులు రక్తదానం చేస్తున్నందుకు సంతోషంగా ఉందని ఆయన చెప్పారు. సమయానికి రక్తం దొరక్క ఎందరో రోగులు, బాధితులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన గుర్తుచేశారు. ఈ శిబిరంలో రక్తదానం చేసిన 154 మందిని పోర్టు సిఇఓ అభినందించారు. అనంతరం వారికి సర్టిఫికెట్లు బహుకరించారు. పోర్టు కార్పొరేట్ అఫైర్స్ హెడ్ వేణుగోపాల్, మనీష్‌దావే, వేణుగోపాల్‌రెడ్డి, విజయ్ మజ్జి, శ్రీనివాస్, గంగా సతీష్, గుడివాడ శ్రీకాంత్, సెక్యూరిటీ డిజిఎం మనోహర్ బాబు, జయలాల్, రాజేష్ రంజన్, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

## ఎన్ఎస్ఎస్ అధికారులకు.. విఎస్‌యులో శిక్షణ



నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూత్ డెవలప్‌మెంట్ వారి సహకారంతో విద్యార్థులలో నైపుణ్యాభివృద్ధి పెంపొందించటంపై ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులకు ఇటీవల మూడు రోజుల శిక్షణా తరగతులు నిర్వహించారు. మొదటిరోజు ప్రొఫెసర్ డేవిడ్ పాల్ ద్వారా స్కిల్‌డెవలప్‌మెంట్‌కు సంబంధించిన అంశాలు తెలిపారు. రెండు ,మూడు రోజుల్లో ట్రైనింగ్ ఆఫీసర్ డాక్టర్ ఆరోగ్యరాజ్, అసిస్టెంట్ ప్రొఫెసర్-సోషల్ వర్క్‌కు చెందిన తిరుపుత్తూరు, (తమిళనాడు) వారు కమ్యూనికేషన్ స్కిల్స్, టైమ్ మేనేజ్‌మెంట్, షార్ట్ మరియు లాంగ్ టరమ్ గోల్స్ వంటి అంశాలను వివరించారు. ఈ కార్యక్రమానికి డా. ఉదయ్‌శంకర్ కార్యనిర్వాహకుడిగా వ్యవహరించగా, ఈ మూడు రోజుల శిక్షణా కార్యక్రమంలో జిల్లాలోని వివిధ కళాశాలల నుంచి 36మంది ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమానికి విఎస్‌యు రిజిస్ట్రార్ ఆచార్య పి.రామచంద్రారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.విజయ ఆనందకుమార్‌బాబు ముఖ్య అతిథులుగా విచ్చేసి పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ శిక్షణ నిర్వహించడానికి ప్రోత్సాహాన్నిచ్చిన విఎస్‌యు వీసీ ఆచార్య జియం సుందరవల్లికి, ఆచార్య వాసంతి రాజేంద్రన్ తదితరులకు నిర్వాహకుడు డా. ఉదయ్‌శంకర్ అల్లం ధన్యవాదాలు తెలిపారు.

### తాళం వేసిన ఇళ్లను లూటీచేసే..

# ఘరానా దొంగలు దొరికారు

- **రూ. 15 లక్షల సొత్తు స్వాధీనం**

తాళం వేసిన ఇళ్లను కనిపెట్టి, తాళాలు పగుల గొట్టి ఉన్నదంతా ఊడ్చుకుపోయే ఇద్దరు ఘరానా దొంగలు పోలీసులకు దొరికిపోయారు. నాలుగు జిల్లాల్లో అనేక దొంగతనాలకు పాల్పడిన పాత నేరస్తుడు మీదూరు సునీల్‌ను, సహకరిస్తున్న మరో నిందితుడిని ముత్తుకూరు పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. గ్రామీణ డిఎస్పీ వీరాంజనేయరెడ్డి ఈనెల 20న ముత్తుకూరులో విలేకర్లకు ఆ వివరాలను వెల్లడించారు. నెల్లూరు, చిత్తూరు, కడప, ప్రకాశం జిల్లాల్లో దొంగతనాలు చేస్తున్న సునీల్ ఇప్పటికే అనేక దొంగతనాల కేసుల్లో జైలుశిక్ష అనుభవించి ఉన్నాడని, మరో నిందితుడు దేవరపల్లి సురేష్‌తో కలిసి ముత్తుకూరు మండలంలో పలు దొంగతనాలకు పాల్పడ్డాడని, తాళాలు వేసివున్న ఇళ్లను లక్ష్యంగా పెట్టుకుని ఇళ్లను దోచుకునేవారని చెప్పారు. జిల్లా ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు ఏఎస్పీలు హిమవతి, ప్రసాద్‌ల పర్యవేక్షణలో కృష్ణపట్నం సిఐ వేమారెడ్డి, ముత్తుకూరు ఎస్ఐ శివకుమార్‌రెడ్డి, సిబ్బందితో కలసి ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఈ నేరస్తుల కోసం గాలించారు. వారిద్దరూ మల్లూరు కూడలిలో ఉన్నారన్న విషయాన్ని తెలుసుకుని ముత్తుకూరు పోలీసులు అక్కడకు చేరుకుని వారిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 15 లక్షల రూపాయల విలువచేసే 27 సవర్ల బంగారు నగలు, రెండు కిలోల వెండి సామగ్రితో పాటు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును త్వరగా ఛేదించడంలో చొరవచూపిన సిఐ వేమారెడ్డి, ఎస్ఐ శివకృష్ణారెడ్డి, సిబ్బంది పెంచలయ్య, సుధాకర్, శ్రీనివాసులు, వెంకటరమణ, వెంకటేశ్వర్లు, నాగార్జున, సుమన్, పెంచలయ్యలకు డిఎస్పీ వీరాంజనేయరెడ్డి రివార్డులు అందించారు.

## టూకీగా...



### రామతీర్థం బ్రహ్మోత్సవాల రాబడి 20.97 లక్షలు

ఇటీవల విడవలూరు మండలం రామతీర్థం బ్రహ్మోత్సవాల సందర్భంగా హుండీలు లెక్కించగా, భక్తులు సమర్పించిన కానుకల ద్వారా ఆలయానికి 20,97,608 రూపాయల రాబడి వచ్చినట్లు ఆలయ ఇఓ రామకృష్ణ తెలిపారు. గత ఏడాదికంటే ఈసారి 7 లక్షలా 96వేల రూపాయలకు పైగానే అధికంగా ఆలయానికి ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు.

### పెంచలకోనలో నిత్యాన్నదానానికి రూ.2 లక్షల విరాళం

జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానంలో నిత్యాన్నదాన పథకానికి అన్నమయ్యజిల్లా రాజంపేట మండలం నూనెవారి పల్లెకి చెందిన బొర్రా ఓబుల్‌రెడ్డి-నారాయణమ్మ దంపతులు ఈనెల 19న 2 లక్షలా 2వేలా 232 రూపాయలు విరాళంగా సమర్పించారు. ఆ మొత్తాన్ని ఆలయసిబ్బందికి అందజేశారు.

### కావలిలో యోగా శిక్షణా తరగతులు

కావలి పాత ఊరు పురపాలకసంఘం ఉన్నతపాఠశాలలో ఎన్‌సిసి అధికారి షేక్ మస్తాన్ ఆధ్వర్యంలో యోగా గురువు గోపాల్ మూడురోజుల పాటు ఎన్‌సిసి క్యాడెట్లకు యోగాలో శిక్షణ ఇచ్చారు. ఆ పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు సిహెచ్ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

### మనుబోలులో గంగమ్మకు పంచామృతాభిషేకం

మండల కేంద్రమైన మనుబోలులో చెరువుగట్టుపై వెలసివున్న గంగమ్మ అమ్మవారికి ఇటీవల ఆలయ అర్చకులు ప్రత్యేకపూజలు నిర్వహించి పంచామృతాభిషేకం చేశారు. పిట్టి నాగరాజు-సురేఖ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయ అర్చకుడు సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

### పుల్లయ్యపల్లిలో ఉపాధి పనుల తనిఖీ

ఉదయగిరి రూరల్ మండల పరిధిలోని పుల్లయ్యపల్లి గ్రామంలో జరుగుతున్న మహాత్మాగాంధీ జాతీయగ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను ఇటీవల ఏపీఓ శ్రీనివాసరావు తనిఖీ చేశారు. ఎండలు మండుతున్నాయి కనుక ఉపాధి కూలీలకు అవసరమైన మంచినీరు, నీడ ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.

### ఇస్కపాళెంలో 'జనజాగృతి' అవగాహన సదస్సు

తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పిస్తే కలిగే ప్రయోజనాలను వివరిస్తూ వెంకటాచలం మండలంలోని ఇస్కపాళెంలో ఇటీవల 'జనజాగృతి' అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామసర్పంచ్ అడపాల ఏడుకొండలు, ప్రధానోపాధ్యాయుడు పార్వతీశం, ఉపాధ్యాయులు మాధవరావు, సుబ్రహ్మణ్యం, గోపీనాథ్, విజయకుమార్ పాల్గొన్నారు.

### బోగోలులో పంచాయతీ రికార్డుల పరిశీలన

బోగోలులో పంచాయతీ రికార్డులను ఇటీవల ఇఓపిఆర్‌డి సిహెచ్ శ్రీదేవి ఆకస్మికంగా తనిఖీచేశారు. ఇళ్లపన్నులు, ఆడిట్ రిపోర్టులు, పారిశుద్ధ్య సిబ్బంది వేతనాలకు సంబంధించిన రికార్డులు సక్రమంగా ఉన్నాయా లేదా అని పరిశీలించారు.

### పెనుబల్లి జడ్పీ విద్యార్థినులకు బహుమతులు

ఇటీవల టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన బుచ్చిరెడ్డిపాళెం మండలం పెనుబల్లి జడ్పీ హైస్కూల్‌కు చెందిన కె.కామాక్షి (బుచ్చి), కె.వైష్ణవి (పెనుబల్లి), జి.యామిని (జొన్నవాడ)లకు 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమంలో భాగంగా ఈనెల 19న వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. సర్పంచ్ పెంచలయ్య, ఏఎంసీ సుధీర్ కుమార్, హెచ్ఎం పీవీ రత్నం, కె.శ్రీనివాసయాదవ్ పాల్గొన్నారు.

### ఈదూరులో విఏఏలకు శిక్షణ

తోటపల్లిగూడూరు మండలం ఈదూరులోని రైతుభరోసా కేంద్రంలో ఈనెల 20న సహాయ వ్యవసాయ సంచాలకులు ఏ.రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో విఏఏలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. యాప్ ద్వారా మట్టినమూనాల సేకరణ, పిఎం కిసాన్ ఇకెవైసి, కౌలు రైతుల కార్డుల గురించి గ్రామ వ్యవసాయాధికారులకు శిక్షణ ఇచ్చారు.

# 'షర్మ్' ఇలా...

(మొదటి పేజీ తరువాయి)

తన రాజకీయ స్వార్థం కోసం ఉమ్మడి రాష్ట్రాన్ని రెండు ముక్కలు చేసి ఆంధ్రాని అంధకారంలోకి నెట్టేసింది సోనియాగాంధీ. అన్నదమ్ముల్లా, అక్కచెల్లెళ్లలా కలిసున్న తెలుగు ప్రజల మధ్య విభజన చిచ్చుపెట్టి చరిత్రాత్మక తప్పిదం చేసింది.

ఆంధ్రులకు వంచన చేసిన అలాంటి సోనియాగాంధీ పంచన ఇప్పుడు రాజశేఖరరెడ్డి బిడ్డ చేరబోతోంది. ఇడుపులపాయలోని వై.ఎస్. సమాధి వేదికగా, జులై8న రాజశేఖరరెడ్డి జయంతి రోజున కాంగ్రెస్ అధినేత్రి సోనియా, ఆమె వారసులు రాహుల్, ప్రియాంకల సమక్షంలో షర్మిల కాంగ్రెస్ తీర్థం తీసుకోనున్నట్లు వార్తలు వస్తున్నాయి. కేవలం ఒక్క రాజకీయ పదవి కోసం రాజశేఖరరెడ్డి అభిమానులను ఆత్మక్షోభకు గురిచేయాలా..? రాజశేఖరరెడ్డి చరిష్మాని షర్మిల తాకట్టు పెట్టాలా..?? అని వై.ఎస్ కుటుంబ అభిమానులు మనోవేదన చెందుతున్నారు.

ఆమె ఒక మాజీ ముఖ్యమంత్రికి కూతురు. మరో ప్రస్తుత ముఖ్యమంత్రికి చెల్లెలు. ఒక పార్టీకి అధ్యక్షురాలు. బహుశా తెలుగు రాష్ట్రాల్లో ఇంతటి స్థాయి క్రెడిట్ మరెవరికీ లేదు. రాజశేఖరరెడ్డి అటు విపక్షాలతోనూ, ఇటు స్వపక్షంలోని ప్రతిపక్షంతోనూ యుద్ధం చేశారు. ఎప్పుడూ ఇలా ఎవ్వరి దగ్గర తన ఆత్మాభిమానాన్ని తాకట్టు పెట్టలేదు. కష్టమైనా, నష్టమైనా నమ్మిన కాంగ్రెస్‌పార్టీని అంటిపెట్టుకునే రాజకీయాలు చేశారు. ఆయన వారసుడు జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో ఉన్న కాంగ్రెస్‌పార్టీపై తిరుగుబాటు చేశారు. అత్యంత అహంకారంగా ప్రవర్తించిన సోనియాగాంధీని ఎదిరించారు. అలుపెరుగని పోరాటం చేసి ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఎదిగారు. ఇంతటి ఘనమైన రాజకీయ వారసత్వం ఉన్న షర్మిల ఒక్క రాజకీయ పదవి కోసం ఇన్ని ఫీట్లు చేయాలా...? అన్న విమర్శ సర్వత్రా వినపడుతోంది. రాజన్న రాజ్యం తెస్తానని ఆమె తెలంగాణలో పార్టీ స్థాపించారు. మంచిదే! ప్రజాస్వామ్యంలో ఎవరైనా పార్టీ పెట్టొచ్చు. ప్రజాసమస్యలపై పోరాటం చేయొచ్చు. ప్రజల తీర్పును బట్టి ముందుకు సాగిపోవాలి. కానీ, షర్మిల ఒక్క ఎన్నికలో కూడా పోటీ చేయకుండానే రూటు మార్చుకున్నారు. కొండంత రాగం తీసి లొల్లాయి పాట పాడినట్లు తనను నమ్మి తన వెంట నడిచిన వాళ్ళని పిచ్చోళ్ళని చేశారామె.

రాయలసీమలో పుట్టి తెలంగాణలో మెట్టిన షర్మిల తెలంగాణ బిడ్డగానే ఆమెను ఆమె ప్రకటించుకుంది. తెలంగాణ ప్రజల మనోభావాల కోసం పోరాటం చేస్తానని బీరాలు పలికింది. ఇప్పుడు ఒక్కసారిగా తన రూటు మార్చుకుని కాంగ్రెస్ గూటికి చేరనుంది. తాను కోరుకుంటున్న ఒక్క రాజకీయ పదవి కోసం సోనియా వద్ద తలవంచింది. తాను కోరుకున్న హోదా కోసం తన నాన్నలా, అన్నలా ఆమె పోరాటం చేయలేకపోయింది. తాను ప్రజలకోసం వచ్చిన బాణాన్ని అని చెప్పుకున్న ఆమె మధ్యలోనే వంగిపోయింది.

వై.ఎస్ రాజశేఖరరెడ్డిని 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటం తర్వాతే అధికారం వరించింది. ఆయన మరణానంతరం ఆయన వారసుడు కూడా పదేళ్ళ రోడ్లపైనే ఉన్నారు. మరి మూడేళ్లకే షర్మిలలో ఓర్పు నశించింది. ఆమె లక్ష్యం నెరవేర్చుకోవడం కోసం ఆమె మరికొంత కాలం పోరాటం చేయలేకపోయింది. ఒక్కసారన్నా ప్రజల తీర్పు చెప్పేవరకు ఆగలేకపోయింది. అలా నిరీక్షించలేని పక్షంలో హుందాగా రాజకీయాల నుంచి తప్పుకోనుండాలి. వై.ఎస్. రాజశేఖరరెడ్డి, వై.ఎస్.జగన్‌లో ఉన్న పట్టుదల, సహనం ఆమెలో లేవని ప్రజలు సరిపెట్టుకునేవారు.

## నాన్న మాట ఇప్పుడే గుర్తొచ్చిందా?

ఏపీలో ప్రస్తుతం కాంగ్రెస్ జీవచ్ఛవం. ఇప్పుడు షర్మిల వచ్చి ఏపీ కాంగ్రెస్ తరపున ప్రచారం చేసినా నష్టం జగన్ మోహన్‌రెడ్డికి, లాభం చంద్రబాబుకే తప్ప షర్మిలకు ఒరిగే లాభమేమి ఉండదు. కాకపోతే తన అన్నని ఓడించడమే ఆమె లక్ష్యమైతే అది నెరవేరడానికి మాత్రం కొంత అవకాశాలు ఉన్నాయన్నది విశ్లేషకుల అభిప్రాయం. రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే తన లక్ష్యమని వై.ఎస్. రాజశేఖరరెడ్డి పలు సందర్భాల్లో, బహిరంగ సభల్లోనూ చెప్పారు. ఇప్పుడు ఆయన ఆశయం నెరవేర్చడం కోసమే కాంగ్రెస్‌తో కలుస్తున్నానని సమర్థించుకుంటున్నారు షర్మిల. మరి తల్లి, అన్నతో కలిసి సోనియాకు వ్యతిరేకంగా పోరాటం చేసినప్పుడు ఈ మాట షర్మిలకు గుర్తుకు రాలేదా? తెలంగాణలో రాజన్న రాజ్యమే లక్ష్యంగా పార్టీ పెట్టినప్పుడు తండ్రి ఆశయం మర్చిపోయారా? తాను అనుకున్న స్థాయిలో వైఎస్సార్‌టీపీకి ఆదరణ లభించకపోవడంతో దిక్కుతోచకనే మళ్లీ కాంగ్రెస్ పంచన చేరడం వాస్తవం కాదా...? అని కూడా విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు. వైఎస్సార్ బతికున్నన్నాళ్లు ఆయనా, ఇప్పుడు ఆయన వారసుడు జగన్‌మోహన్ రెడ్డి ఆంధ్రజ్యోతితో యుద్ధం చేస్తూనే ఉన్నారు. తమ ఆగర్భశత్రువులా వాళ్ళు రాధాకృష్ణని పరిగణిస్తారు. అలాంటిది షర్మిల మాత్రం అదే ఏబీఎన్‌లో కూర్చుని వైఎస్సార్ పరువు బజారుకీడ్చారు. అలాంటి షర్మిల ఇప్పుడు ఒక్కసారిగా నాన్న ఆశయం కోసం కాంగ్రెస్‌లో చేరుతున్నా అంటే ప్రజలు విశ్వసిస్తారా..? అన్నది మేధావుల అనుమానం.

## కాంగ్రెస్ డ్రామాలో బలికాక తప్పదు?

ఇప్పటికే రెండుగా చీలిన వై.ఎస్.రాజశేఖరరెడ్డి కుటుంబం తాజా పరిణామాలతో మరింత ఇరకాటంలో పడుతుందేమో అన్న అనుమానం విశ్లేషకుల నుండి వ్యక్తమవుతోంది. తెలంగాణలో వైఎస్సార్‌టీపీ పేరుతో వేరు కుంపటి పెట్టుకున్న షర్మిల, ఇప్పుడు ఆ కుటుంబ బద్ధశత్రువు కాంగ్రెస్‌తో జత కలవడం వై.ఎస్. కుటుంబ అభిమానులను కలవరపెడుతోంది. రాజకీయంగా గుర్తింపు కావాలన్న ఉబలాటం, ఏదో ఒక పదవి కోసం ఆరాటం, తన ఉనికి కోసం పోరాటం చేస్తున్న షర్మిలను రాజన్న బాణంగా వాడుకోవడానికి ఆమెను ముందుపెట్టి ఇప్పుడు కాంగ్రెస్ తన పబ్బం గడుపుకునే ప్రయత్నం చేయబోతోంది.

రాజశేఖరరెడ్డి కొడుకు జగన్‌మోహన్ రెడ్డినే తమకు అవసరం లేదనుకుని 16 నెలలు జైల్లో పెట్టించింది సోనియా. ఇప్పుడు తెలంగాణలో అధికారం కోసం కాంగ్రెస్ ఆడబోయే కొత్త డ్రామాలో షర్మిలని బలివ్వడానికి సిద్ధం చేస్తోందన్నది విశ్లేషకుల అభిప్రాయం. కార్యకర్తలతో సమానంగా నాయకులు ఉండే కాంగ్రెస్ పార్టీలో షర్మిలని అందలం ఎక్కించడం, ఏదో ఒక పదవితో ఆమెను సంతృప్తి పరచడం సాధ్యమేనా అన్న అనుమానం ఆ పార్టీ వర్గాల్లోనే వ్యక్తమవుతోంది.

## రెండేళ్లకే...

2021 ఫిబ్రవరి 9వ తేదీన తెలంగాణలో షర్మిల వైఎస్సార్టీపీ స్థాపించారు. పార్టీ ప్రారంభించిన తొలినాళ్లలో ఉన్న కేడర్ కూడా ఇప్పుడు ఆమెతో లేదు. క్రమేణా ఆమె క్యాడరంతా ఇతర పార్టీల్లోకి జంప్ అయ్యారు. పాలేరు నుంచి తాను బరిలోకి దిగినా గెలుస్తాననే నమ్మకం లేదు. 44 స్థానాల్లో ఖచ్చితంగా గెలుస్తామని చెప్తున్న షర్మిలకి తన పార్టీలో తాను తప్ప మరో ఎమ్మెల్యే అభ్యర్థే లేరు. దీనికి కారణం నాయకత్వ లోపమే. లీడర్ సరిగ్గా ఉంటే క్యాడర్ కూడా ఆత్మస్థైర్యంతో పనిచేస్తుంది. లీడరే నీరుగారిపోతే కేడర్ కూడా చెల్లాచెదురైపోతుంది. ఈ రెండేళ్లలో వైఎస్సార్టీపీలో జరిగిందదే. ఏపీలో కుటుంబ పరంగా, రాజకీయపరంగా ప్రాధాన్యం దక్కలేదని తెలంగాణలో వేరు కుంపటి పెట్టారు. పార్టీ పెట్టగానే కాంగ్రెస్ నుంచి కీలక నాయకులు క్యూ కడతారని అతి ఆత్మవిశ్వాసానికి పోయారు. చిన్నాచితకా నాయకులు బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్‌ల్లోకి వెళ్తున్నారే తప్ప వైఎస్సార్టీపీలోకి ఎవరూ రావడం లేదు. ఈ రెండేళ్లు తెలంగాణలో ఊరూరు తిరిగి బీఆర్ఎస్‌తో పాటు కాంగ్రెస్‌పై కూడా తీవ్ర విమర్శలు చేశారు. స్వతహాగా వై.ఎస్.కుటుంబానికి కాంగ్రెస్ బద్ధశత్రువు. కాంగ్రెస్ పేరు వింటే చాలు వై.ఎస్ అనుచరులు మండిపడతారు. అలాంటి కాంగ్రెస్ పంచన చేరడం తెలుగు ప్రజలను వంచన చేయడం కాదా..? అన్న ప్రశ్న కూడా రాజకీయ వర్గాల్లో నుండి వినపడుతోంది.

## కాంగ్రెస్ - షర్మిల దోస్తీకి తలోచేయి

కర్ణాటక ఎన్నికల ఫలితాల తర్వాత తెలంగాణలో కాంగ్రెస్ రాజకీయంగా వేగంగా అడుగులు వేస్తోంది. వైఎస్సార్ ఇమేజ్‌తో మళ్లీ పూర్వవైభవం కోసం ఆ పార్టీ ప్రయత్నిస్తోంది. ఈ వ్యవహారంలో కర్ణాటక డిప్యూటీ సీఎం డి.కె.శివకుమార్ కీలకంగా వ్యవహరిస్తున్నారు. నేరుగా ప్రియాంక ద్వారా షర్మిలతో మాట్లాడించారు. పార్టీని విలీనం చేయాలని తెలంగాణలో కాంగ్రెస్ హైకమాండ్ నాయకులతో ప్రతిపాదన చేయించారు. ఒకనాడు సోనియాను ఎదిరించి తన అన్నతో కలిసి పోరాటం చేసిన షర్మిల ఇప్పుడు తిరిగి అదే పార్టీ నాయకత్వానికి తలొగ్గారు. జూలై 8న వైఎస్సార్ జయంతి సందర్భంగా ఇడుపులపాయ కేంద్రంగా కాంగ్రెస్ - షర్మిల దోస్తీని అధికారికంగా ప్రకటించేందుకు సన్నద్ధమవుతున్నారు.

## ఏపీ విభజన ద్రోహి కాంగ్రెస్

హైదరాబాద్ లేని రాష్ట్రాన్ని ఎప్పుడైనా ఊహించామా? కానీ విభజనతో హైదరాబాద్ లేని రాష్ట్రమే మనకు మిగిలింది. హైదరాబాద్ అభివృద్ధి, ఆదాయమూ తెచ్చిపెట్టే కామధేనువు. దానిని కోల్పోవడం వల్ల ఏపీకి జరిగిన నష్టాన్ని పూరించకుండానే విభజన పూర్తిచేసి, ఏపీని కోలుకోని దెబ్బతీసింది కాంగ్రెస్‌పార్టీ. విభజన జరిగి 9 ఏళ్లవుతున్నా, ఇంకా రాష్ట్రాన్ని విభజన కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. రాష్ట్రం విడిపోతే ఏపీకి నష్టమని భావించిన వైఎస్సార్ తన హయాంలో తెలంగాణ నినాదమే వినపడకుండా పాలించారు. ఆయన మరణించడంతో రాష్ట్ర విభజన జరిగిపోయింది. విభజనతో ఏపీకి ఎన్నటికీ మానని గాయాలు మిగిల్చిన అదే కాంగ్రెస్‌తో రాజన్న బిడ్డ కలిసి అడుగేయడం ఆంధ్రులు ఎప్పటికీ జీర్ణించుకోలేని విషయం. జాతీయ భాష హిందీలో 'షర్మ్' అంటే సిగ్గు అని అర్థం. యావత్ వై.ఎస్. కుటుంబ అభిమానులు సిగ్గుపడేలా, ఇలా షర్మిల జాతీయ స్థాయిలో వై.ఎస్. కుటుంబ పరువు తీయడం బాధాకరం. రాజన్నా క్షమించు..!



## యాచేంద్ర-రామ్ ఆత్మీయ కలయిక

వెంకటగిరి సంస్థానాధీశులు, ప్రముఖ సారస్వతవేత్త సాయికృష్ణ యాచేంద్రను వెంకటగిరిలోని రాజాగారి కోటలో ఇటీవల ఏపీ కమ్యూనిటీ బోర్డు డెవలప్‌మెంట్ ఛైర్మన్, వెంకటగిరి నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఆయన తనయుడు నేదురుమల్లి విక్రమ్‌రెడ్డి ఆత్మీయంగా కలుసుకున్నారు.

## చెన్నైలో 25న 'పొన్నూరు' వారి ఉపన్యాసం

వేద విజ్ఞాన వేదిక-చెన్నై ఆధ్వర్యంలో జులై 25న 'శ్రీకాళహస్తీశ్వర మహాత్మ్యం -ధూర్జటి కవితా మాధుర్యం' అనే అంశంపై సాహిత్యోపన్యాసం ఉంటుందని వేదిక అధ్యక్ష కార్యదర్శులు జెకె రెడ్డి, కందనూరు మధు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ సారస్వతవేత్త పొన్నూరు వేంకట శ్రీనివాసులు (అధ్యక్షులు-ప్రకాశం జిల్లా రచయితల సంఘం, ఒంగోలు) పాల్గొని ఉపన్యసిస్తారని, చెన్నైలోని టీనగర్ కృష్ణాహాల్, ఆంధ్రా క్లబ్ వేదికపై ఈ కార్యక్రమం నిర్వహించనున్నామని పేర్కొన్నారు. 'తరతరాల తెలుగు కవిత' అనే కార్యక్రమం కింద వేద విజ్ఞానవేదిక ద్వారా ప్రతి మాసం ఒక విశిష్ట అంశంపై ప్రసంగాలుంటాయని, ఇది 138వ ఉపన్యాస ధారావాహిక అని వారు తెలిపారు. సాహితీ ప్రియులందరూ ఈ కార్యక్రమానికి విచ్చేసి జయప్రదం చేయాలని వారు కోరారు.



## శ్రీసిటీని సందర్శించిన 'జెట్రో' బృందం

జపాన్ ఎక్స్‌టర్నల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (జెట్రో)కు చెందిన డైరెక్టర్ జనరల్ (చెన్నై) కౌరు షిరైషి, డైరెక్టర్ జనరల్ (అహ్మదాబాద్) తకేహికో ఫురుకావా, డైరెక్టర్ (న్యూఢిల్లీ) టాకు హిరోకి తదితర ఏడుగురు ఉన్నత స్థాయి ప్రతినిధులు ఇటీవల శ్రీసిటీని సందర్శించారు. జపాన్ మరియు ఇతర దేశాల మధ్య పరస్పర ప్రయోజనకరమైన వాణిజ్యం, పెట్టుబడి సంబంధాలను ప్రోత్సహించే జపాన్ ప్రభుత్వ మద్దతు గల ప్రత్యేక సంస్థ ఇది. శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్ కామత్ జెట్రో సీనియర్ ప్రతినిధులకు స్వాగతం పలికారు. శ్రీసిటీ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ (మార్కెటింగ్) శివశంకర్ శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతలు, ప్రపంచశ్రేణి మౌలిక సదుపాయాలతో పాటు ఇక్కడ పెట్టుబడిదారుల అనుకూల పర్యావరణ వ్యవస్థ గురించి వారికి వివరించారు. శ్రీసిటీలో అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలపై కౌరు షిరైషి సంతృప్తిని వ్యక్తం చేశారు. శ్రీసిటీ దేశంలోనే రెండవ అతిపెద్ద జపనీస్ టౌన్‌షిప్. ఇప్పటికే ఇక్కడ ఉన్న చాలామంది జపనీస్ ఎంటర్‌ప్రైజెస్ వారు తమ తయారీ కేంద్రాలను విస్తరింపజేసుకుంటున్న విషయాన్ని వారు తెలుసుకుని సంతోషించారు. శ్రీసిటీ గురించి ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు వారు శ్రీసిటీలో పర్యటించారు. కొన్ని జపాన్ పరిశ్రమలను సందర్శించారు.

## నిర్వాసితులను ఆదుకోవాలి

### - సిపిఎం డిమాండ్

పోలవరం నిర్వాసితులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ డిమాండ్ చేశారు. ఈనెల 20న ఆయన నెల్లూరులోని సిపిఎం కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, పోలవరం నిర్వాసితులకు పునరావాసం కల్పించాలని, నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ నెల్లిపాకం నుంచి విజయవాడ వరకు సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన మహాపాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం మహా పాదయాత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. మోహన్‌రావు, కత్తి శ్రీనివాసులు, మస్తాన్‌బీ, బత్తల కిష్టయ్య, సూర్యనారాయణ, వెంకటరమణ పాల్గొన్నారు.

# లండన్ వెళుతున్నారా? మీ మొబైల్ జాగ్రత్త!



'బ్రిటన్' ఓ గొప్ప యూరోపియన్ దేశంగా మన మనసుల్లో నాటుకుపోయింది. ప్రపంచంలో అణ్వస్త్రాలు కలిగిన ఐదు ఒరిజినల్ అగ్రరాజ్యాలలో 'గ్రేట్ బ్రిటన్' ఒకటి. 15వ శతాబ్దం నుంచి మొదలుపెట్టి, దాదాపు 56 దేశాలకు తన పరిపాలనను విస్తరించుకుంటూ వచ్చిన ఇంగ్లాండ్ దేశంకు రాజధాని లండన్. దాని అందచందాలు, నిర్మాణాలు, నిర్మాణ కౌశలాలు చూట్టానికి రెండు కళ్ళూ సరిపోవు. బ్రిటిష్ రాజరిక భవనాలు, వెస్ట్ మినిస్టర్ ప్రాంతంలోని పార్లమెంట్ భవన సముదాయం, మేడం టుస్సాడ్ వ్యాక్స్ మ్యూజియం, హీత్రో ఎయిర్‌పోర్ట్, నిముషానికి ఒకటి వంతున నిశ్శబ్దంగా అటూ ఇటూ పరుగులు దీసే వందలాది మెట్రో రైళ్ళ వ్యవస్థ, థేమ్స్ నదిలో ఊబర్ ఏ.సీ.బోట్‌లో... సోఫాల్లో కూర్చుని ప్రయాణం, లండన్ 'ఐ'లో లండన్ నగర దర్శనం, స్కాట్లాండ్ టూర్...

లండన్ ఎట్రాక్షన్లు ఒకటి కాదు, రెండు కాదు... మొత్తం అంతా తిరిగి చూడడానికి ఆరు నెలల కంటే తక్కువ సమయం సరిపోదు (విజిటర్స్ వీసా కూడా ఆరు నెలలకే ఇస్తారు).

మరి, 56 దేశాలను బ్రిటీషోడు ఊరికే పరిపాలించలేదు అనిపిస్తుంది, ఆ నగర మేజెస్టీని, రాజసాన్ని చూసినప్పుడు.

'అవును గదా! అని అబ్బురపడుతూ... వాటి అందచందాలకు మురిసిపోతూ చూసేటప్పుడు... మీ చేతుల్లో మీ మొబైల్ ఫోన్ ఉంటే మాత్రం... హుష్‌కాకి అయిపోవచ్చన్న మాటే. రోడ్ మీద ఉన్నంత సేపూ ఈ విషయం గుర్తుపెట్టుకోవాలి.

లండన్ నగర జీవనం ఎంత నాగరికమైనదో... ఎంత ఆధునికమైనదో... లండన్‌లో "ఫోన్ స్నాచింగ్" అంత ఉధృతమైంది. యూరోపియన్ దేశాలలో ఫోన్ స్నాచింగ్ మామూలే గానీ, లండన్‌లో మరీ ఎక్కువ. లండన్‌లో "ఫోన్ స్నాచింగ్" అనేది నేరగాళ్ళకు ఓ చిన్నపాటి పరిశ్రమగా మారిపోయిందని లండన్ పోలీసులంటున్నారు.

ఒక్క లండన్ నగరంలో సరాసరిన ప్రతి ఆరు నిముషాలకు ఓ మొబైల్ ఫోన్‌ను స్నాచ్ చేస్తారని పోలీస్ లెక్కలు చెబుతున్నాయి.

గత ఏడాది 90,864 మొబైల్‌ఫోన్లను లండన్ రోడ్ల మీద తస్కరించారు. అంటే రోజుకు 250 ఫోన్లు.

సాంకేతికత, ఆధునికత బాగా పెరిగిన నేపథ్యంలో... యాపిల్ ఫోన్ కలిగి ఉండడానికే ప్రతి ఒక్కరూ ఇష్టపడుతుంటారు. ఆ ఫోన్ క్రేజ్ అలాంటిది. ఖరీదు కూడా బాగా ఎక్కువ. దాంతో, ఆ ఫోన్‌కు 'దొంగ ఫోన్ మార్కెట్'లో మంచి ధర కూడా లభిస్తుందట. యాపిల్ ఫోన్ మోడల్‌ను బట్టి, 250 పౌండ్ల వరకు (మన కరెన్సీలో పాతిక వేల రూపాయలు) లభిస్తుందని లండన్‌లో స్థానికుడు ఒకరు చెప్పి, 'మీ ఫోన్ జాగ్రత్త' అని హెచ్చరించాడు.

ఈ ఫోన్లను క్షణాల్లో కొనే డీలర్లు కూడా ఉంటారు. వీటిని వారు ఆఫ్రికా దేశాల్లో సెకండ్‌హ్యాండ్ ఫోన్ మార్కెట్‌కి పంపిస్తారు.

దీంతో, యువకులకు... ఉపాధి అవకాశాలు కష్టంగా మారిన వారికి, 'ఫోన్ స్నాచింగ్' అనేది ఓ లాభసాటి ఉపాధి వ్యాపకంగా మారిపోయిందని పోలీసులు అంటున్నారు. క్షణాలలో ఫోన్‌ను స్నాచ్‌చేసే అవకాశం ఉండడం, ఇందుకు పెద్దగా ప్లానింగ్ అవసరం లేకపోవడం, దొంగిలించిన ఫోన్‌లను క్షణాల్లో తీసుకుని, డబ్బులు అప్పటికప్పుడు ఇచ్చే వ్యాపారులు ఉండడం, తల మొత్తం హెల్మెట్‌తో కప్పి ఉంచుకునే వెసులుబాటు వల్ల, ఏ సీసీ కెమేరాకు చిక్కే అవకాశం లేకపోవడం మొదలైన కారణాల వల్ల, ఫోన్ స్నాచింగ్ అనేది లండన్‌లో మంచి లాభసాటి వ్యాపకంగా తయారైనట్టు కనపడుతుందని, ఈ ట్రెండ్‌ను పరిశీలించే వారు అంటున్నారు.

ఒకసారి దొంగతనానికి గురైన ఫోన్‌ను తిరిగి పట్టుకోవడం పోలీసులకు... శక్తికి మించిన సవాల్‌గా పరిణమించింది. గత ఏడాది తస్కరణకు గురైన 90 వేలకు పైబడిన ఫోన్లలో... కేవలం రెండు శాతం ఫోన్లనే రికవరీ చేయగలిగారు.

లండన్‌లో మోపెడ్‌లు ఎక్కడపడితే అక్కడ అద్దెకు దొరుకుతాయి. వాటిని తిరిగి ఎక్కడపడితే అక్కడ వదిలేయొచ్చు. అంతా క్రెడిట్ కార్డు / డెబిట్ కార్డు పేమెంట్. మొహాలు... ఒక్క శాతం కూడా కనపడకుండా హెల్మెట్‌లు కప్పేస్తాయి. ఇద్దరేసి యువకులు ఒక మోపెడ్‌పై తిరుగుతూ 'వేట' మొదలుపెడతారు. ఒంటరి గానో... లేక మరొకరితోనో రోడ్ పక్కన నిలబడో... నడుస్తూనో ఫోన్‌లో మాట్లాడుతూ కనపడితే, వారి పక్కగా వచ్చి... ఫోన్‌ను క్షణకాలంలో గుంజేసుకుని ఉడాయిస్తారు. ఈ హఠాత్పరిణామం నుంచి ఆ వ్యక్తి తేరుకునేలోపే, మోపెడ్ కనుమరుగైపోతుంది. లండన్ పోలీసుల పరువు తీస్తున్న నేరాలలో ఇది ముఖ్యమైనది.

మొబైల్ దొంగల బారినపడకుండా ఉండడానికి, లండన్ పోలీసులు అనేక సూచనలు చేస్తున్నారు.

- రోడ్లపై మాట్లాడడం సాధ్యమైనంత వరకు తగ్గించండి.
- నడుస్తూ ఫోన్‌లో మాట్లాడకండి.
- సాధ్యమైనంత తక్కువ సమయమే ఫోన్‌లో మాట్లాడండి.
- మీ పరిసరాల్లో మోపెడ్‌లపై ఎవరైనా సంచరిస్తున్నారేమో గమనించండి.
- వీలైతే ఏదైనా గోడను ఆనుకుని ఫోన్‌లో మాట్లాడండి. అప్పుడు మీ వెనుక నుంచి ఎవరూ వచ్చి, మీ ఫోన్ లాక్కెళ్ళే వీలు ఉండదు.

ఫోన్ తస్కరణకు ఇంకో పద్ధతి ఉంది. హఠాత్తుగా ఒకతను వచ్చి మన ముందు ఆగుతాడు, "నా ఫోన్ పోయింది. మీ ఫోన్ ఓసారి ఇస్తారా... ఒక కాల్ చేసుకుని ఇస్తాను" అంటాడు. పోనీలే పాపం అని ఫోన్ ఇచ్చిన మరు క్షణం 100 కిలోమీటర్ల వేగంతో ఎటో మాయమై పోతాడు.

అంతర్జాతీయ టూరిస్ట్ కేంద్రంగా పర్యాటకులను విశేషంగా ఆకర్షించే నగరం – లండన్. బ్రిటిష్ పార్లమెంట్ భవన సముదాయం ఉన్న వెస్ట్ మినిస్టర్ ప్రాంతం ఎప్పుడూ ప్రపంచ దేశాల పర్యాటకులతో కిటకిటలాడుతూ ఉంటుంది. ఒంటి మీద దుస్తులు ఉన్నోళ్లు... లేనోళ్ళు... తెల్లోళ్ళు... నల్లోళ్ళు... దుస్తులు కొనుక్కోడానికి డబ్బుల్లేక – అలాగే చెడ్డీలు, బ్రాసరీలు / బనీన్‌లు / రేబాన్ కళ్ళ జోళ్ళు / చేతుల్లో లేటెస్ట్ ఆపిల్ ఫోన్ ..... ఇలా ప్రపంచంలోని వివిధ జాతులు / మతాలు / దేశాలు / తెగలకు చెందిన వారు ఈ వెస్ట్ మినిస్టర్ ప్రాంతంలో మహోత్సుడుగా... ఫోన్లలో మాట్లాడుకుంటూ అటూ ఇటూ తిరుగుతూ కనపడతారు. లండన్ మొత్తం మీద, 'ఫోన్ స్నాచింగ్' ఇక్కడే ఎక్కువ అని లండన్ పోలీసు గణాంకాలు చెబుతున్నాయి.

లండన్ నగరం మొత్తం మీద రోజుకు 250 ఫోన్‌లు తస్కరణకు గురి అవుతుంటే... అందులో 100 వరకు వెస్ట్ మినిస్టర్ ప్రాంతంలోనే కొట్టే స్తున్నారట.






మెట్రో రైళ్లు, సిటీ బస్సులు, మాల్స్‌లో మాత్రం ఫోన్‌లు సురక్షితమే. వీటిల్లో... ఫోన్లు గుంజుకున్నా... పారిపోవడం కుదరదు. అందుకని, అందరూ పెద్ద మనుషులే.

ముఖ్యంగా ఫుట్‌పాత్‌ల మీద నిలబడి ఫోన్ మాట్లాడడం, నడుస్తూ మాట్లాడడం మాత్రం కొంచెం రిస్క్‌తో కూడిన పని. కేవలం ఫోన్ దొంగల్ని పట్టు కోవడం కోసమే లండన్ పోలీసులు నాలుగు ప్రత్యేక మైన బృందాలు ఏర్పాటు చేశారంటే పరిస్థితి తీవ్ర తను అర్థం చేసుకోవచ్చు. ఆ బృందాలు నిరంతరం పనిచేస్తూ ఉంటాయి.


ఈ ఒక్క అపశృతిని మినహాయిస్తే, లండన్ నగరం, అక్కడి పౌర జీవనం, వ్యక్తుల గౌరవానికి ఇచ్చే గుర్తింపు, వ్యక్తుల మధ్య పరస్పర వ్యవహారశైలి, వ్యవస్థల నిజాయతీతో కూడిన పనితీరు... ఓ అద్భుతం. మనకు ఎప్పటికీ అనుభవంలోకి రావడానికి అసలు అవకాశమే లేని అద్భుతం.

నేను మే నెల అంతా లండన్‌లోనే ఉన్నాను.

లండన్‌లో ఉన్న పౌరజీవన విధానం దాదాపుగా అమెరికాలోనూ, ఇతర అభివృద్ధి చెందిన యూరో పియన్ దేశాలు, సింగపూర్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో సైతం ఉన్నప్పటికీ లండన్‌లో కనిపించిన జనజీవన తీరు మనస్సును ఎంతగానో హత్తుకుంది.

నెలరోజుల లండన్ పర్యటనలో... చిరస్మర ణీయమైన అనుభూతిగా ఒక ఘటన మిగిలి పోయింది.

'ప్రపంచ కార్మికులారా ఏకం కండు' అనే పిలుపుతో ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది ప్రజల జీవనాలను, ఆలోచనలను దశా బ్దాలుగా అమితంగా ప్రభావితం చేసిన, చేస్తున్న, చేయనున్న కమ్యూనిస్టు సిద్ధాంతానికి బీజం వేసిన కారల్ మార్క్స్ సమాధిని దర్శించి, నివాళి అర్పించడం నా జీవితంలో మరిచిపోలేని అనుభూతిని మిగిల్చింది.



ఆయన జర్మనీ దేశస్తుడు. కానీ, ఆయన, ఆయన కుటుంబ సభ్యుల సమాధులు మాత్రం లండన్‌లో ఉన్నాయి.

వీటిని దాదాపు 67, 68 సంవత్స రాల క్రితం ఇక్కడ నార్త్ లండన్‌లోని ఈస్ట్ హైగేట్ ప్రాంతంలోని సమాధి వాటికలో ఏర్పాటు చేశారు. నిజానికి ఈ సమాధి వాటికలో 53వేల సమా ధులు ఉన్నాయి. దాదాపుగా అన్నీ కూడా మన ఊళ్ళల్లో క్రైస్తవ సమా ధులు ఉన్నట్టే.... ఒకదాని పక్కన ఒకటి.. ఖాళీ జాగా లేకుండా ఉంటాయి. వారి వారి కుటుంబ సభ్యులు ఆయా వ్యక్తులకు సంబంధించిన సందర్భాలలో అక్కడికి వచ్చి, సమాధుల రూపంలో ఉన్న తమ బంధుమిత్రులకు నివాళులు అర్పిస్తూ ఉంటారు.

ఒక్క కారల్ మార్క్స్ స్మృతి చిహ్నం మాత్రమే – ఆరడుగుల పాలరాతి దిమ్మెపై కంచుతో రూపొందించిన మార్క్స్ బస్ట్ సైజు విగ్రహం ఉంటుంది.

ఇది దర్శించుకోడానికి 10 పౌండ్ల (వెయ్యి రూపాయలు) ఎంట్రీ ఫీ ఉంది. మే నెల 22వ తేదీన ఈ స్మృతి చిహ్నాన్ని దర్శించుకున్నాను.

ఇక, పౌర జీవనం విషయానికి వస్తే.. లండన్ రోడ్ల మీద వందలు, వేల చిన్న కార్లు, ట్రక్కులు, బస్సులు, ఇతర మోటారు వాహనాలు తిరుగుతూ ఉన్నప్పటికీ... హార్న్ శబ్దం అనేది అస్సలు వినపడదు.

లండన్ అనే కాదు, 8 గంటల ప్రయాణ దూరంలో ఉన్న స్కాట్లాండ్‌లోగానీ, గ్లాస్కో నగరంలో గానీ, గ్రామీణ ప్రాంతంలో గానీ హార్న్ శబ్దం అనేది నెల రోజులలో ఒక్కసారీ వినిపించ లేదు.

ట్రాఫిక్ రెడ్‌లైట్ పడితే, మొత్తం ట్రాఫిక్ అంతా నిశ్శబ్దంగా ఆగిపోతుంది. అలాగే, ఆకుపచ్చ లైట్ పడగానే వాహనాలు అన్నీ నిశ్శబ్దంగా ఒకదాని వెనుక ఒకటి బయలుదేరుతాయి. హార్న్ మోగించడం అన్న ప్రశ్నే లేదు. రొటీన్‌గా, స్టీరింగ్ ముందు కూర్చోగానే, హార్న్ కొట్టే మనకు ఇది ఎనిమిదో వింతగానే కనిపిస్తుంది.




అలాగే, బిజీరోడ్లపై రోడ్ దాటే వారికి ఓ ప్రత్యేక ఏర్పాటు కనపడు తుంది. ముఖ్యమైన అన్ని రోడ్ల ఫుట్ పాత్‌లపై, ఒక చిన్న బాక్స్ ఉంటుంది (మన టెలిఫోన్ కాయిన్ బాక్స్ లాంటిది).

రోడ్డు దాట దలుచుకున్నవారు ఆ బాక్స్‌లో ఉన్న బటన్ నొక్కితే, WAIT అని వెలుగుతుంది. ఒక్క క్షణంలో ఆకు పచ్చ లైటు వీరికి, ఎర్ర లైటు రోడ్డుపై కార్లకు వెలుగుతాయి. అంతే! అటూ, ఇటూ కూడా ఎక్కడి వాహనాలు అక్కడే ఆగుతాయి, నిశ్శబ్దంగా.

ఇటువంటి ఏర్పాటు లేని చోట్ల కూడా... పాదచారులు ఎవరైనా రోడ్డు దాటడానికి ప్రయత్నిస్తుంటే, రోడ్డుపై వెళ్లే వాహనాల వారు తమ వాహనాలు ఆపేసి, రోడ్ క్రాస్ చేయమని పాదచారులకు సైగలు చేయడం మనకు అబ్బురం అనిపిస్తుంది. కనువిందు చేస్తుంది.

ఇక, మన రాజకీయ గమనంలో ఫ్లెక్సీలదే అగ్ర తాంబూలం. ఫ్లెక్సీ లేకపోతే నాయకులు లేరు. అభిమానులు లేరు. కార్యక్రమాలు లేవు. బహిరంగ సభలు లేవు. అసలు, రాజకీయమే లేదు. కానీ, లండన్‌లో బహిరంగ ప్రదేశాలలో ఒక్క ఫ్లెక్సీ కూడా కనపడదు. పౌరులేమిటో... వారి జీవనం ఏమిటో...! అదితప్ప, పార్టీలు, వాటి నాయకులు, వారి ఫ్లెక్సీలు వారికి పట్టవ్. ఎన్నికల సమయంలో ఫ్లెక్సీలు పెడతారేమో తెలియదు.

అవకాశం ఉన్నవారు ఒక్కసారి లండన్ వెళ్ళగలిగితే, అక్కడి పౌర సమాజానికి, మన పౌర సమాజానికి మధ్య గల తేడా ఏమిటనేది తెలుస్తుంది.

అన్నట్టు, లండన్ వెళ్ళేవారు.... ఫోన్ కొంచెం జాగ్రత్తగా హేండిల్ చెయ్యండే!

- భోగాది వేంకట రాయుడు
medhomadhanam@gmail.com



# శ్రీసిటీలో వేడుకగా 'యోగా' దినోత్సవం

అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన పారిశ్రామికవాడ శ్రీసిటీలో ఈనెల 21న 9వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని అత్యంత వేడుకగా నిర్వహించారు. శ్రీసిటీ జనరల్ మేనేజర్ సన్యాసిరావు ఆధ్వర్యంలో జరిగిన యోగా కార్యక్రమంలో సుమారు 260 మంది పాల్గొని యోగాసనాలు సాధనచేశారు. ఏలూరులోని యోగా కాన్షస్‌నెస్ ట్రస్ట్‌కు చెందిన యోగా గురువు సత్యారావు ప్రత్యేక అతిథిగా పాల్గొని సూర్య నమస్కారాలు, వివిధ శ్వాస వ్యాయామాల పట్ల శిక్షణ ఇస్తూ, యోగా వలన కలిగే పలు ప్రయోజనాలను అందరికీ వివరించారు. ఈ సందర్భంగా శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన సందేశంలో, ప్రాచీన భారతావని మానవాళికి అందించిన అమూల్య బహుమతి 'యోగా' అని పేర్కొన్నారు. యోగసాధన ద్వారా శారీరక, మానసిక దృఢత్వాన్ని పొందవచ్చన్నారు. దైనందిక జీవితంలో యోగాను ఒక భాగం చేసుకొని, తద్వారా మంచి ఆరోగ్యం, చక్కని మానవ సంబంధాలు, మంచి ఆలోచనలను పొందాలని సూచించారు. స్థానిక క్రీక్‌సైడ్ అపార్ట్‌మెంట్స్‌లో ప్రతిరోజూ యోగ తరగతులు నిర్వహిస్తున్నామని, శ్రీసిటీ కమ్యూనిటీ దానిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శ్రీసిటీ సెజ్ ఆథరైజ్డ్ అధికారి కె.రామారావు, శ్రీసిటీ పరిశ్రమల ప్రతినిధులు, విద్యార్థులు, పరిసర గ్రామాల ప్రజలతో పాటు శ్రీసిటీ డిప్యూటీ పోలీస్ సూపరింటెండెంట్ జగదీష్ నాయక్, స్పెసిఫైడ్ ఆఫీసర్ మధుబాబు, అసిస్టెంట్ డెవలప్‌మెంట్ కమిషనర్ సత్య నారాయణ, శ్రీసిటీ సెక్యూరిటీ-విజిలెన్స్ హెడ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# చంద్రయాన్-3కు షార్‌లో సన్నాహాలు

అంతరిక్షయాత్రలో ఎంతో ప్రతిష్టాత్మకమైన చంద్రయాన్-3 రాకెట్ ప్రయోగానికి షార్‌లో సన్నాహాలు జరుగుతున్నాయి. వాతావరణంతో పాటు అన్ని సాంకేతిక పరిస్థితులు అనుకూలిస్తే బహుశా జులై 12వ తేదీన ఎల్‌వీఎం-3 రాకెట్ ద్వారా ఈ ప్రయోగం చేపట్టడానికి భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) షార్ శాస్త్రవేత్తలు నిరంతరం కృషిచేస్తున్నారు. ఇప్పటికే చంద్రయాన్-3కు సంబంధించిన వివిధ పరిశోధనలు ఒక కొలిక్కి వచ్చినట్లు సమాచారం. ఇటీవలి కాలంలో షార్ నుంచి ప్రయోగించిన పలు రాకెట్‌లు నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకుని విజయవంతం కావడంతో శాస్త్రవేత్తలు అదే స్ఫూర్తితో పరిశోధనలు మరింత ఉత్సాహంతో కొనసాగిస్తున్నారు. ఇస్రో ఛైర్మన్ కె.సోమనాథ్ సారధ్యంలో రాకెట్ ప్రయోగ సన్నాహాలు చేస్తున్నారు. అన్ని పరీక్షలు, పరిశోధనలు పూర్తయ్యాక చంద్రయాన్ రాకెట్ అంతరిక్షంలోకి దూసుకుపోనుంది.

# వాహన తనిఖీ అధికారుల దాడులు

## • పలు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు స్వాధీనం



నెల్లూరులోని రవాణా శాఖాధికారులు ఉపరవాణ కమిషనర్ చందర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఈనెల 21న వాహన తనిఖీలు నిర్వహించారు. త్రైమాసిక పనులు చెల్లించకుండా బెంగళూరు నుండి విజయవాడ వెళ్తున్న నాలుగు ప్రైవేట్ ట్రావెల్స్ వాహనాలను గుర్తించారు. ఆ వాహనాలపై వాహన తనిఖీ రసీదులు నమోదు చేసి నాలుగు వాహనాలను స్వాధీనపరచుకున్నారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా త్రైమాసిక పన్ను చెల్లించకుండానే ప్రైవేట్ ట్రావెల్స్ వాహనాలు తిరగడం పట్ల రవాణా శాఖ గట్టి చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. జాతీయ రహదారిలో ఇతర వాహనాల డ్రైవర్ల కళ్ళకు ఇబ్బంది కలిగేలా మిరుమిట్లు గొలిపే కాంతివంతమైన లైట్లు కలిగిన వాహనాలపై ముఖ్యంగా ప్రైవేట్ ట్రావెల్స్‌పై ఈ సందర్భంగా 10 కేసులు నమోదు చేశారు. అలాగే ప్రైవేట్ ట్రావెల్స్ సరుకు రవాణా (కమర్షియల్ గూడ్స్ ట్రాన్స్‌పోర్టేషన్) చేస్తున్న 10 వాహనాలపై కేసు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో మోటార్ వాహన తనిఖీ అధికారులు బాలమురళీకృష్ణ, గోపి నాయక్, రాంబాబు, సుందర్‌రావు, కార్తీక్ పవన్, పూర్ణచంద్రరావు, స్వప్నిల్‌రెడ్డి పాల్గొన్నారు. ఇదేవిధంగా, గత వారంలో కూడా త్రైమాసిక పన్ను చెల్లించకుండా తిరుగుతున్న 3 ప్రైవేట్ ట్రావెల్స్ వాహనాలపై కేసులు నమోదు చేశారు. ఈ మాసంలో టాక్స్ చెల్లించకుండా తిరుగుతున్న ఏడు వాహనాలపై కేసులు నమోదు చేశారు. ప్రైవేట్ వాహనాల అక్రమాలను నిరోధిస్తున్నందుకు వాహన తనిఖీ అధికారులను ఉప రవాణా కమిషనర్ చందర్ అభినందించారు. ఈ వాహనాలపై దాదాపు 30లక్షల రూపాయల పన్ను, పెనాల్టీ వసూలు కావలసి ఉందని ఆయన అన్నారు.

# ప్రపంచనేతగా విఖ్యాతిని పొందుతున్న మోడీ

## - కొనియాడిన బీజేపీ జాతీయ నేత దుష్యంత్‌కుమార్ గౌతమ్



దేశంలో సుపరిపాలన సాగిస్తున్న భారత ప్రధాని నరేంద్రమోడీ పట్ల ప్రపంచవ్యాప్తంగా గౌరవం పెరుగుతోందని, అమెరికాలో ఇటీవల జరిగిన ఒక సర్వేలో ప్రజలు 67శాతం మంది నరేంద్రమోడీని మహాశక్తివంతమైన ప్రపంచనేతగా పేర్కొన్నారని, అంతర్జాతీయస్థాయిలో మోడీ ప్రతిష్ట ఎంతగానో పెరుగుతోందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి దుష్యంత్ కుమార్ గౌతమ్ కొనియాడారు. ఈనెల 21న నెల్లూరుజిల్లాలోని కావలి పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో జరిగిన 'మహాజన సంపర్క్ అభియాన్' సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా యోగా దినోత్సవం ఎంతో ఉత్సాహంగా జరుగుతోందంటే ఆ ఘనత ప్రధాని మోడీదే నన్నారు. నరేంద్రమోడీ దేశానికి ప్రధాని అయ్యాక దేశం అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతోందని, ప్రపంచదేశాలు ఇప్పుడు భారత్‌వైపు చూస్తున్నాయని ఆయన తెలిపారు. దేశంలో ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందించడమే కాక, ప్రపంచవ్యాప్తంగా నరేంద్రమోడీ అనేక దేశాలకు ఇస్తున్న సహకారం ఆయా దేశాల్లో మనదేశ ప్రతిష్టను ఎంతగానో పెంచుతోందన్నారు. మోడీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను బీజేపీ కార్యకర్తలు, నాయకులు పూర్తిస్థాయిలో అవగాహన చేసుకుని వాటిని ప్రజలకు అర్ధమయ్యే విధంగా తెలియజెప్పాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

### కక్షలు కార్పణ్యాలకు నిలయంగా.. ఏపీ

**- సోము ధ్వజం**

వైకాపా పాలనలో ఆంధ్రప్రదేశ్ కక్షలు కార్పణ్యాలకు నిలయంగా మారిందని, ముఖ్యమంత్రితో సహా వైకాపా నాయకులు అవినీతిలో మునిగితేలుతున్నారని, రాష్ట్ర ప్రజల సమస్యలు పట్టించుకోవడం లేదని ఈ సభలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు ధ్వజమెత్తారు. ప్రస్తుతమున్న పరిస్థితుల్లో రాష్ట్రం బాగుపడాలంటే రాష్ట్రంలోనూ బీజేపీ పాలన అత్యవసరమన్నారు. వైకాపా నాయకులు ప్రజలను నిలువుదోపిడీ చేయడమే పనిగా పెట్టుకున్నారని, వారి అరాచకాలను, దోపిడీని ప్రశ్నిస్తే దాడులు చేస్తున్నారని, అక్రమ కేసులు బనాయిస్తున్నారని అన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు అవినీతిసామ్రాట్‌లుగా మారారన్నారు. దేశంలో నరేంద్రమోడీ ప్రభుత్వంలో ప్రజలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు అందుతున్నాయని, ఆంధ్రలో కేంద్రం ఇస్తున్న నిధులను, పథకాలను తామే ఇస్తున్నట్లు వైకాపా ప్రచారం చేసుకుంటోందని, కేంద్ర నిధులతో అభివృద్ధి జరుగుతున్నదే తప్ప వైకాపా ప్రభుత్వం సాధిస్తున్న పురోగతి ఏమీ లేదని ఆయన పేర్కొన్నారు. జిల్లా బీజేపీ నాయకులు గుండ్లపల్లి భరత్‌కుమార్ యాదవ్, వాకాటి నారాయణరెడ్డి, సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, పి.సురేంద్రరెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి, కందుకూరి సత్యనారాయణ, కోలా ఆనంద్, కాకు విజయలక్ష్మి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యత కలిగిన ఆహారాన్నే ప్రజలకు అందజేయాలి

## ➤ వ్యాపారులకు జేసీ కూర్మనాథ్ హెచ్చరిక




నాణ్యమైన ఆహారపదార్థాలు పెట్టకుండా వినియోగదారులకు ఏమాత్రం నష్టం కలిగించినా సహించేది లేదని జిల్లా జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ వ్యాపారులను హెచ్చరించారు. ఈనెల 21న స్థానిక డిఆర్‌డిఏ సమావేశ మందిరంలో, భారత జాతీయ వీధి వ్యాపారుల సంఘం ఆధ్వర్యంలో, నెస్లే కంపెనీవారి సారధ్యంలో వీధివ్యాపారులకు జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వీధి వ్యాపారులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, నాణ్యమైన ఆహారపదార్థాలను వినియోగదారులకు అందించాలని చెప్పారు. పరిశుభ్రత, నాణ్యతలతో కూడిన పదార్థాలను విక్రయించకుండా, కల్తీ ఆహారాన్ని విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, ప్రముఖ హోటళ్ళు, రెస్టారెంట్లు, వీధి వ్యాపారులు విక్రయిస్తున్న ఆహారపదార్థాలను తాము క్రమం తప్పకుండా పరిశీలిస్తామని, వాడిన నూనెలనే మళ్ళీ మళ్ళీ వాడుతుండడంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని, ఇలాంటి విషయాల్లో వ్యాపారులు తప్పనిసరిగా శ్రద్ధ తీసుకుని మంచి ఆహారపదార్థాలనే ప్రజలకు అందజేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ డా. డి.రవీంద్ర, డిఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ సాంబశివారెడ్డి, ఫుడ్‌సేఫ్టీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### శ్రీ రాజరాజేశ్వరిదేవి ఆలయానికి

## 31.04 లక్షల ఆదాయం

నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలో ఈనెల 21న హుండీ లెక్కింపులు జరిగాయి. గత మార్చి 1 నుంచి జూన్ 21 వరకు భక్తులు సమర్పించిన కానుకల ద్వారా 31.04.466 రూపాయలు వచ్చినట్లు ఆలయవర్గాలు తెలిపాయి.

# మోటారుసైకిళ్ళ దొంగ చిక్కాడు

## • రెండు జిల్లాల్లో చోరీలు • 11 బైక్‌లు స్వాధీనం

మోటార్ సైకిళ్ళను దొంగిలించుకుపోతూ, చాలా కాలంగా పోలీసుల కళ్ళుగప్పి తిరుగుతున్న ఓ పాత నేరస్తుడు ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. నిందితుడి నుంచి 11 మోటారు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ సుమారు 5.4లక్షల రూపాయలుంటుంది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. నెల్లూరు బీవీనగర్‌కు చెందిన సూర్య అనే పాత నేరస్తుడు మద్యానికి బానిసై గత కొన్నేళ్లుగా మోటారు సైకిళ్ళ దొంగతనాలకు పాల్పడుతున్నాడు. నగరంలోని వేదాయపాళెం పరిధిలో తరచూ మోటారు సైకిళ్ళు అపహరణకు గురవుతుండడంతో నెల్లూరు నగర డిఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి రంగంలోకి దిగి వేదాయపాళెం ఇన్స్‌పెక్టర్ పీవీ నారాయణతో కలసి బైక్‌ల అపహరణపై నిఘా పెట్టారు. సాంకేతిక పరిజ్ఞానంతో నేరస్తుడిని గుర్తించి, ఈనెల 21న కొండాయపాళెం వద్ద వాహన తనిఖీల్లో సూర్యను పట్టుకున్నారు. స్టేషన్‌కు తీసుకువచ్చి విచారించగా నెల్లూరుజిల్లాలోనే కాక, తిరుపతి జిల్లాల్లో కూడా బైక్‌లు అపహరించాడన్న సంగతి తెలిసింది. వేదాయపాళెం పరిధిలో 4 బైక్‌లు, బాలాజీనగర్ పరిధిలో 2, సంతపేట, తోటపల్లిగూడూరు పరిధిలో ఒక్కొక్కటి వంతున బైక్‌లు అపహరించడమే కాక, తిరుపతి జిల్లా అలిపిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో 1, తిరుపతి ఈస్ట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 1 బైక్‌ను కూడా దొంగిలించుకుపోయినట్లు నిర్ధారణ అయిందని పోలీసులు తెలిపారు. ఆ వాహనాలన్నిటినీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ప్రతిభ చూపిన ఎస్ఐ రాజ్‌కుమార్, ఏఎస్ఐ ప్రసాద్, హెడ్‌కానిస్టేబుల్ జి.సుబ్బారావు, కానిస్టేబుళ్ళు గోపాల్, నాగరాజు, మాలకొండయ్యలను జిల్లా ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డి అభినందించారు.

### గూడూరులో ముగ్గురు నిందితుల అరెస్ట్

తిరుపతి జిల్లా, చిల్లకూరు మండలం, తిమ్మనగారిపాలెంలోని వెంకటేశ్వర పెట్రోఅలైస్ కంపెనీలో దాదాపు 5 లక్షలు విలువైన కాపర్ వస్తువులను దొంగతనం చేసిన ముగ్గురు నిందితులు గిద్దలూరు సుమంత్, పల్లమాల కిషోర్, కె.అరవింద్‌లను ఈ నెల 18వ తేదీ గూడూరు డిఎస్పీ సూర్యనారాయణరెడ్డి పర్యవేక్షణలో పోలీసులు అరెస్ట్ చేశారు.

Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com